

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | మంగళవారం 09-05-2023 | సంపుటి : 04 | సంచిక : 222 | పేజీలు : 4 | వెల : రూ 3-00

# ఆర్య వైశ్యులకు అండగా ఉంటాం

**టిడిపి అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తాం**
**రోశయ్య మృతితో పెద్దదిక్కును కోల్పోయాం**
**కర్నూలు యాత్రలో ఆర్యవైశ్యులతో భేటీ అయిన లోకేశ్**





కర్నూలు,మే8 : ఆర్యవైశ్యుల్లో పేదరికం ఉందని, వారిని ఆదుకుంటామని టిడిపి నేత నారా లోకేశ్ అన్నారు. గతంలో సిఎంగా ఉన్న చంద్రబాబు రూ.30 కోట్లతో కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారని చెప్పు కొచ్చారు. కానీ ప్రభుత్వం మారాక కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. టీడీపీ వచ్చాక దామాషా ప్రకారం నిధులు కేటాయించి ఖర్చు చేస్తామన్నారు. పేదరికానికి కులం, మతం ఉండదని ఆయన తెలిపారు. కొన్ని కులాలతో పాటు ఆర్యవైశ్యులకు వైసీపీ పాలనలో ప్రాధాన్యత లేకుండా పోయిందన్నారు. ఆ కులాల పట్ల వైసీపీకి ఎంత చిన్నచూపు ఉందో అర్థం చేసుకోవాలన్నారు. నాలుగేళ్ల వైసీపీ పాలనలో ఎవర్ని కదిలించినా బాధితులుగా ఉన్నారన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ యువగళం పాదయాత్ర జిల్లాలో కొనసాగుతోంది. పాదయాత్రలో భాగంగా శ్రీవాసవి కన్యాకాపరమేశ్వరి చిన్నమ్మ వారిశాలలో ఆర్యవైశ్యులతో నారా లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా యువనేత మాట్లాడుతూ.. ఆర్యవైశు ్యలకు ఎప్పుడూ అండగా ఉండేది టీడీపీనే అని అన్నారు. రోశయ్యకు ప్రతి పుట్టినరోజుకు ఫోన్ చేసి శుభాకాంక్షలు చెప్పేవాడినని,. రాజకీయాలకు అతీతంగా రోశయ్య పని చేశారని కొనియాడారు. రోశయ్య చనిపోయినప్పుడు సీఎం జగన్ వెళ్లలేదన్నారు. రోశయ్య కాంగ్రెస్ అయినా తమకు ఆయనంటే గౌరవం ఉందని తెలిపారు. రోశయ్యకు తగిన గౌరవం కల్పిస్తామని.. మ్యూజియం ఏర్పాటు చేసి, ఆయన సేవల తాలూకా ఆనవాళు మ్యూజియంలో ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి మధ్య పెద్ద వాదనలు జరిగినప్పుడు రోశయ్య సంధాన కర్తగా ఉండేవారని గుర్తుచేశారు. రోశయ్య సీఎం అయ్యాక చంద్రబాబుకు సెక్యూరిటీ కల్పించారన్నారు. రోశయ్య చనిపోవడంతో ఆర్యవైశ్యుల్లో పెద్దదిక్కు లేకుండా పోయిందన్నారు. పోలీసులు కూడా బయటకు వచ్చి తాము కూడా ఈ ప్రభుత్వంలో బాధితులమే అని వాపోతున్నారన్నారు. పక్కరాష్ట్రాల అభివృద్ధిని చూసి అసూయ పడాల్సి వస్తోందని అన్నారు. సమర్థవంతమైన పాలన లేక రాష్ట్రం వెనకబడుతోందన్నారు. అందరిలో చైతన్యం రావాలని.. ఒక్కరిపై కేసు పెడతారు..వెయ్యి మందిపై పెడతారా.? అని ప్రశ్నించారు. ఏపీ బ్రాండ్ దెబ్బతి న్నదని..అమర్‌రాజాఎక్కువపన్నుచెల్లిస్తుందని.. కంపెనీని తెలంగాణకు తరిమారని మండిపడ్డారు. కర్నూలులో 1000 మెగావాట్లతో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేశామని.. నాలుగేళ్లుగా సోలార్ ప్లాంట్‌పై ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు.

# సీఎం జగన్‌ను కలిసిన సిక్కు మత పెద్దలు..

**కార్పొరేషన్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్**



తాడేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో సిక్కు మత పెద్దలు కలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌తో పలు అంశాలపై చర్చించారు. ఈ క్రమంలో సిక్కు మత పెద్దల విజ్ఞప్తిపై సీఎం జగన్ సానుకూలంగా స్పందించారు.- సిక్కుల కోసం కార్పొరేషన్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్. గురుద్వారా లకు ఆస్తి పన్ను మినహాయింపు విజ్ఞప్తిపై సీఎం జగన్ అంగీకారం తెలిపారు. ఈ క్రమంలో గురుద్వా రాలపై ఆస్తి పన్ను తొలగించాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు. గురుద్వారాల్లోని పూజారులైన గ్రంథీలకు పూజారులు, పాస్టర్లు, మౌలాలీల మాదిరిగానే ప్రయోజ నాలు ఇవ్వనున్నట్టు తెలిపారు.- గురునానక్ జయంతి రోజైన కార్తీక పౌర్ణమి నాడు సెలవు ప్రకటనపై సీఎం జగన్ అంగీకారం తెలిపారు. వచ్చే మంత్రివర్గ సమావేశంలో దీనికి సంబంధించి తీర్మానం కూడా చేస్తామని స్పష్టం చేశారు.- ఒక మైనార్టీ విద్యాసంస్థను పెట్టుకునేం దుకు సహాయం అందిస్తామన్నారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే చర్యల్లో భాగంగా సిక్కులకు అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశ్రామికంగా కూడా సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈల



వ్యాపారాలను పెంచే క్రమంలో చర్యలు ఉండాలని సీఎం జగన్ సూచించారు. 10 రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు.

# పంటలు నీళ్లపాలైతే పట్టించు ఏదీ

**రైతుల కన్నీళ్లు పట్టని నీరో చక్రవర్తి జగన్**
**టిడిపినేత ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆగ్రహం**

అమరావతి,మే8 : పంటలు నీళ్లపాలై రైతులు బోరుమంటుంటే, సిఎం జగన్ తాడేపల్లిలో సంబరాలు చేసుకుంటున్నారని మాజీ శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... రైతుల కన్నీళ్లు కష్టాలు పట్టని అభినవ నీరోచక్రవర్తి జగన్మోహన్ రెడ్డి అంటూ వ్యాఖ్యలు చేశారు. మంత్రులేమో రైతుల కష్టాలు, కన్నీళ్లను అవహేళన చేస్తూ, వెటకారంగా మాట్లాడుతున్నారన్నారు. వ్యవసాయ మంత్రి మాటలు కోటలు దాటుతుంటే, చేతలు గడపదాటడంలేదని విమర్శించారు. రైతుల కన్నీళ్లు తుడవలేని పదవులు, అధికారం



ముఖ్యమంత్రికి, మంత్రులకు దేనికి.. రాష్ట్రాన్ని తగలెట్టడానికా అని ప్రశ్నించారు. ఉచిత పంటల బీమా పేరుతో జగన్ ప్రభుత్వం రైతుల్ని కష్టకాలంలో దిక్కులేని వాళ్లని చేసిందన్నారు. పంట తడిచినా, నేలకొరిగినా, బాగున్నా రైతులకు పరిహారం ఇవ్వాలనే ఇంగితం ఈ ప్రభుత్వానికి లేకపోవడం సిగ్గుచేటన్నారు. పంటల బీమా సాయాన్ని జగన్ ప్రభుత్వం సకాలంలో చెల్లించని పాపం రైతులకు శాపంగా మారిందన్నారు. డిసెంబర్ 31లోపు ప్రభుత్వ వాటాగా చెల్లించాల్సిన పంట బీమాసొమ్ము 80 శాతాన్ని జగన్ ప్రభుత్వం చెల్లించలేదని కేంద్ర ప్రభుత్వ ఫసల్ బీమా వెబ్ సైట్ చెబుతోందని ఆయన తెలిపారు. ఎకరాకు నష్టపరిహారం ఇస్తానన్న జగన్.. 50 లక్షల మంది రైతులంటే, 25 లక్షల మందికే పంటల బీమా సొమ్ము అందించి చేతులు దులుపుకున్నారని వ్యాఖ్యలు చేశారు.

# కర్నూలు పాతబస్తీలో ఉద్రిక్తత

**లోకేష్‌ను అడ్డుకున్న ఎమ్మెల్యే హాఫీజ్, ఆయన వర్గీయులు**

కర్నూలుకర్నూలు,మే8( : కర్నూలు పాతబస్తీలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్రలో భాగంగా కర్నూలులో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. పాదయాత్ర కర్నూలులోని పాతబస్తీకి చేరుకున్న సమయంలో నారా లోకేష్‌ను ఎమ్మెల్యే హఫీజ్, ఆయన వర్గీయులు అడ్డుకున్నారు. టీడీపీ శ్రేణులు సైతం ప్రతిఘటించాయి. ఈ నేపథ్యంలో కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. అనంతరం పోలీసులు అక్కడకు చేరుకుని హఫీజ్‌ను జీపులో ఎక్కించి తీసుకెళ్లారు. సోమవారం ఉదయం ఎస్‌టీబీసీ గ్రౌండ్ విడిది కేంద్రం నుంచి పాదయాత్రను ప్రారంభించిన లోకేష్‌ను ముందుగా మహాజన సోషల్ సమైక్యతా సంఘం ప్రతినిధులు కలిశారు. తమ సమస్యలను తెలియజేశారు. అనంతరం జిల్లా కోర్టు భవనం వద్దకు పాదయాత్ర చేరుకోగా.. యువనేతను జిల్లా న్యాయవాదుల కలిసి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన లోకేష్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. కర్నూలుకు కేటాయించిన జ్యుడిషియల్ అకాడమీని జగన్ తరలించారన్నారు. హైకోర్టు ఏర్పాటు చేస్తామని నాలుగేళ్లుగా మోసం చేశారని తెలిపారు. అమరావతిలోనే హైకోర్టు ఉంటుందని సుప్రీం కోర్టులో వైసీపీ ప్రభుత్వం తెలిపిందని.. విశాఖలో హైకోర్టు అని మంత్రి బుగ్గన చెప్పారన్నారు. జగన్ మాయ మాటలు విని మోసపోయామని న్యాయవాదులు ఆవేదన వ్యక్తం చేశారు. యువనేత మాట్లాడుతూ.. జగన్ లా మాట మార్చి, మడమ తిప్పే బ్యాచ్ తమది కాదన్నారు. బెంచ్ ఖచ్చితంగా ఏర్పాటు చేసి తీరుతామని స్పష్టం చేశారు. అనంతరం యువనేతను 50వ డివిజన్ ప్రజలు కలిశారు. కర్నూలు 50వ డివిజన్ టిడ్కో బాధితులు యువనేత లోకేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తమ డివిజన్‌లో 1200 మంది గత ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లకోసం రూ.లక్ష చొప్పున చెల్లించామని.. ఇంతవరకు ఇళ్లను పూర్తిచేసి ఇవ్వలేదన్నారు. వార్డుల్లో మంచినీరు సరిగా రావడంలేదని.. నీటి సమస్య ఇబ్బందిగా ఉందన్నారు. బీసీ కార్పొరేషన్‌లో లోన్లు తీసుకున్న 18 మంది రజకులు లోన్లు క్లియర్ చేస్తామని చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. 50వ వార్డులో పార్కు, లైబ్రరీ ఏర్పాటు చేయాలని కోరారు. తమ వార్డులో విద్యుత్ స్తంభాలు, విద్యుత్, డ్రైనేజి సమస్యలు ఉన్నాయన్నారు. సమస్యల పరిష్కారానికి చొరవచూపాలని యువనేతను కోరారు. లోకేష్ మాట్లాడుతూ... టీడీపీ ప్రభుత్వ హయాంలో 90 శాతానికి పైగా పూర్తి చేసిన టిడ్కో ఇళ్లను మిగిలిన పనులు పూర్తి చేసి ఇవ్వకుండా సైకో ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని మండిపడ్డారు. పట్టణాలు, నగరాల్లో పన్నుల బాదుడుపై ఉన్న శ్రద్ధ, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంపై లేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక 50వ డివిజన్ తాగునీరు, డ్రైనేజి, విద్యుత్ వంటి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. 50వ డివిజన్‌లో ఖాళీస్థలాన్ని గుర్తించి పార్కు, లైబ్రరీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని లోకేష్ హామీ ఇచ్చారు.

# ప్రజా స్పందన లేకున్నా బాబు పాట్లు

**ఎన్నికల్లో పొత్తుల కోసం వెంపర్లాట**
**టిడిపి విమర్శలపై మండిపడ్డ అంబటి**



అమరావతి,మే8 : చంద్రబాబు పర్యటనలో జన స్పందన లేకపోయినప్పటికీ అద్భుత ప్రజాదరణ అంటూ ఎల్లో మీడియా బాకాలు పలుకుతోందని జలవనరుల శాఖ మంత్రిఅంబటి రాంబాబు ధ్వజమెత్తారు. ప్రజల్లో అంత ఆదరణ ఉంటే చంద్రబాబు ఒంటరిగా ఎందుకు పోటీ చేయరని, అందరూ కలిసి రండి అని ఎందుకు ఆహ్వానిస్తున్నారని ప్రశ్నించారు. సింగిల్‌గా పోటీ చేసే దమ్ము లేక కలిసి పోటీ చేయడానికి వేదిక సిద్ధం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. 'పన్నులు లేకుండా ప్రభుత్వాలు నడుస్తాయా.. గతంలో చంద్రబాబు పన్నులు లేకుండానే ప్రభుత్వాన్ని నడిపారా' అంటూ ప్రశ్నించారు. నవరత్నాలు, సంక్షేమ కార్యక్రమాలు అమలు కాకూడదని కుట్రలో భాగంగానే ఈ రాద్ధాంత మంతా చేస్తుంటే, దానికి ఎల్లో మీడియా వత్తాసు పలుకుతోందని మండిపడ్డారు. ఇదిలావుంటే వైఎస్సార్‌సీపీకి ఎవరితోనూ పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం లేదనిపార్టీ స్పష్టం చేశారు. ఓటమి భయంతో.. ఎవరికైతే ప్రజల మద్దతు లేదనుకుంటున్నారో.. వాళ్లే పొత్తుల కోసం చూస్తున్నారంటూ టీడీపీ అధినేత చంద్రబాబుపై సెటైర్లు వేశారు. చంద్రబాబుకు ఎన్నికలలో గెలుస్తామన్న నమ్మకం లేదు. చంద్రబాబును ప్రజలు ఎప్పుడో తిరస్కరించారు. అసలు ప్రజల్లో ఆయన పట్ల విశ్వసనీయత లేదు. పైగా బాబుది దుర్మార్గపు ఆలోచన. ఎప్పుడూ ఇతరులపైనే ఆధారపడే తత్వం. పైగా వెన్నుపోటు పొడుస్తాడు అంటూ వ్యాఖ్యానించారు. ఎవరెన్ని పొత్తులు పెట్టుకున్నా వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరన్నారు. పెరిగిన ధరలపై చంద్రబాబు అనసర రాజకీయాలు చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్ డీజిల్ ధరలు పెరిగితే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి గానీ, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పై ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

# ప్రజలు మార్పును కోరుకుంటున్నారు

**చంద్రబాబుతోనే ఏపికి భవిష్యత్: సోమిరెడ్డి**

నెల్లూరు,మే8( : ఆంధ్ర రాష్ట్రంలో ప్రజలు ప్రభుత్వ మార్పును కోరుకుంటున్నారని టిడిపి నేత, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు.. ప్రజా సమస్యలు, ప్రభుత్వ బాదుడే బాదుడుపై ప్రజల అభిప్రాయాలు, అవేదన, ఆగ్రహం రాష్ట్రంలోని ప్రభుత్వ వ్యతిరేకతను చాటాయని.. ప్రతి ఇంట్లో, ప్రతి గ్రామంలో ప్రజలు మార్పును కోరుకుంటున్న తీరు స్పష్టంగా కనిపించిందని పేర్కొన్నారు. తెలుగు తమ్ముళ్లలో కసి, ప్రజల్లో తెలుగుదేశం పార్టీపై ఆసక్తి రానున్న మార్పును సూచిస్తున్నాయనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే ఏపీ పునర్నిర్మాణం జరుగుతుంని చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఆ తర్వాతే రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగుల వేస్తుందన్నారు.. కానీ, జగన్ పాలనా వల్ల రాష్ట్రం అప్పులపాలైందని విమర్శించారు. అయితే, ప్రస్తుతం సీట్లు గురించి చర్చే అవసరం లేదు.. ముందు జగన్ పరిపాలనకు చమరగీతం పాడాలన్నారు.. వైసీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ ఏపీని వ్యాపారం కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. సగటు ఏపీ పౌరుడు తలదించుకునే విధంగా జగన్ పరిపాలన ఉందన్నారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రను అపకీర్తిపాలు చేశారని మండిపడ్డారు.

# హిందూపురం సీఐ ఇస్మాయిల్‌పై ఏపీ హైకోర్టు ఆగ్రహం

అనంతపురం మే 8 హిందూపురం సీఐ ఇస్మాయిల్‌పై ఏపీ హైకోర్టు (ఆగ్రహం వ్యక్తం చేసింది. జ్యుడీషియల్ అధికారిపై దాడి చేయడాన్ని ధర్మాసనం తీవ్రంగా తప్పుపట్టింది. సీఐకు ఎంత ధైర్యం అంటూ న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. సీఐ చర్య కోర్టు పరిపాలన విధులకు ఆటంకం కలిగించేలా ఉందని వ్యాఖ్యానించింది.సీఐపై కోర్టు దిక్కరణ చర్యలు ప్రారంభించాలని రిజిస్ట్రార్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అలాగే అడ్వకేట్ కమిషన్, కోర్టు సిబ్బందిపై చేయి చేసుకున్న ఘటనలో సీఐ ఇస్మాయిల్‌పై



ధర్మాసనం సుమోటో పిల్ నమోదు చేసింది. దీనిపై సోమవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రశాంత్ కుమార్ మిశ్రా ధర్మాసనం ముందు విచారణ జరిగింది. వివరాల్లోకి వెళితే..హిందూపురంలో గిరిష్ అనే వ్యక్తిని అక్రమ నిర్బంధం చేశారంటూ అక్కడి కోర్టులో పిటిషన్ వేసే సమయంలో కోర్టు.. అడ్వకేట్ కమిషనర్, సిబ్బందిని అక్కడికి పంపింది. పోలీస్ స్టేషన్‌లో గిరిష్ ఉండడం, చిత్రహింసలకు గురిచేయడంతో.. అతనిని కోర్టులో హాజరుపరచాలని అడ్వకేట్ కమిషనర్ చెప్పగా.. సీఐ ఇస్మాయిల్ అడ్వకేట్ కమిషనర్, కోర్టు సిబ్బందిపై చేయి చేసుకున్నారనే ఆరోపణలపై జిల్లా జడ్జి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అధికారులు ఇచ్చిన నివేదికను జిల్లా కోర్టు.. రాష్ట్ర హైకోర్టుకు పంపగా దానిని రిజిస్ట్రార్.. ప్రధాన న్యాయమూర్తి ముందుంచారు. దీనిపై వెంటనే సుమోటోగా కేసు నమోదు చేయాలని ఆదేశించారు.

# సంపాదకీయం

మంగళవారం 09-05-2023

## కలవరపెడుతున్న నిరుద్యోగ రేటు

టీవలే చైనాను దాటి, ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ అవతరించింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు ఉపాధి కల్పించడం ప్రభుత్వానికి అతి పెద్ద సవాలు. నానాటికీ పెరుగుతున్న నిరుద్యోగ గణాంకాలు ఇలాంటి సవాలు తీవ్రతను పెంచుతూనే ఉంటాయి. తాజా డేటా ప్రకారం, 2023 ఏప్రిల్ నెలలో భారతదేశంలో నిరుద్యోగిత రేటు 8 శాతం దాటింది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమి  తాజా సమాచారం ప్రకారం, భారతదేశ నిరుద్యోగిత రేటు ఏప్రిల్ నెలలో 8.11 శాతానికి పెరిగింది, ఇది నాలుగు నెలల గరిష్ట స్థాయి. మార్చి నెలలో నమోదైన 7.8 శాతం నుంచి ఇది పెరిగింది. పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం మార్చిలోని 8.51 శాతం నుంచి ఏప్రిల్‌లో 9.8 శాతానికి పెరిగింది. గ్రామీణ నిరుద్యోగం మార్చిలోని 7.47 శాతం నుంచి ఏప్రిల్‌లో 7.34 శాతానికి స్వల్పంగా తగ్గింది.దేశంలో నిరుద్యోగం పెరిగినప్పటికీ, ఏప్రిల్‌లో భారతదేశ శ్రామిక శక్తి భాగస్వామ్యం 2.55 కోట్లు పెరిగి 46.76 కోట్లకు చేరుకుంది, మొత్తం భాగస్వామ్య రేటు 41.98 శాతానికి పెరిగింది. లేబర్ పార్టిసిపేషన్ రేట్ అంటే, పని చేయడానికి అర్హులైన వ్యక్తుల సంఖ్యను సూచించే గణాంకం. మార్చి నెలలో దీని రేటు 39.77 శాతంగా ఉంది, ఏప్రిల్‌లో 41.98 శాతానికి పెరిగింది. అంటే, పని చేయగల వారి సంఖ్య ఒక్క నెలలోనే 2.55 కోట్లు పెరిగింది. ఈ స్థాయి లేబర్ పార్టిసిపేషన్‌కు తగ్గట్లుగా ఉద్యోగాలను సృష్టించడం ఏ ప్రభుత్వానికైనా ఇబ్బందే. ముఖ్యంగా, వచ్చే వేసవిలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల ద్వారా ముచ్చటగా మూడోసారి ప్రధాని పదవిని చేపట్టాలని చూస్తున్న నరేంద్ర మోదీకి ఇది చాలా పెద్ద సవాలు.అయితే, సీఎంఐఈ డేటా నుంచి కొన్ని సానుకూల అంశాలు కూడా ఉన్నాయి. ఏప్రిల్ నెలలో శ్రామిక శక్తిలో చేరిన వారి సంఖ్య రికార్డు స్థాయిలో ఉండటం వల్ల ఉపాధి దొరుకుతుందన్న విశ్వాసం ప్రజల్లో పెరిగిందని సూచిస్తోందని సీఎంఐఈ  పేర్కొంది. గణాంకాల ప్రకారం, ఏప్రిల్ నెలలో శ్రామిక శక్తికి జత కలిసిన వారిలో 87 శాతం మంది ఉపాధి పొందడంలో విజయం సాధించారు. అంటే ఏప్రిల్ నెలలో 2.21 కోట్ల మందికి ఉపాధి లభించింది. ఈ కారణంగా, ఏప్రిల్‌లో మొత్తం ఉపాధి కూలీల సంఖ్య 42.97 కోట్లకు పెరిగింది, ఇది నెల క్రితం 40.76 కోట్లు. జాబ్ మార్కెట్ మెరుగుపడుతుందని ఇది తెలియజేస్తోంది.వార్షిక పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే  నివేదికల ప్రకారం, గ్రాడ్యుయేట్ డిగ్రీ హోల్డర్లలో నిరుద్యోగం రేటు తగ్గుముఖం పడుతోందని కేంద్ర కార్మిక ఉ ఉపాధి శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తెలి మార్చి నెలలో వెల్లడించారు. "తాజాగా అందుబాటులో ఉన్న వార్షిక పీఎల్ఎఫ్ఎస్ నివేదికల ప్రకారం... 2019-20, 2020-21, 2021-22 సంవత్సరాల్లో, 15 ఏళ్లు ఉ అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న గ్రాడ్యుయేట్ల నిరుద్యోగిత రేటు వరుసగా 17.2%, 15.5%, 14.9%గా ఉంది. గ్రాడ్యుయేట్ డిగ్రీ హోల్డర్ల నిరుద్యోగిత రేటులో తగ్గుదల ధోరణిని ఇది చూపుతోంది" అని తెలి చెప్పారు. స్టాటిస్టిక్స్ ఉ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడిచే పీఎల్ఎఫ్ఎస్, దేశంలో ఉపాధి ఉ నిరుద్యోగానికి సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తుంది.వరుసగా మూడో సంవత్సరం కూడా, 2023-24 బడ్జెట్‌లో మూలధన పెట్టుబడి వ్యయాన్ని 33 శాతం పెంచి రూ. 10 లక్షల కోట్లకు పెంచాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. ఇది జీడీపీలో 3.3 శాతం. ఫలితంగా, మౌలిక సదుపాయాలు ఉ ఉత్పాదక సామర్థ్యం పెంపులో పెట్టుబడులు పెరిగాయి, ఉద్యోగ కల్పనను పెంచాయి.

## ఒకే టికెట్‌పై రెండు బస్సుల్లో ప్రయాణం..

విజయవాడ, మే 7, ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ సరికొత్త నిర్ణయం తీసుకుంది. ప్రయాణికుల సౌకర్యార్థం మల్టీ సిటీ జర్నీ కి వీలుగా రిజర్వేషన్ సౌకర్యాన్ని తీసుకొస్తోంది. ఒకే టికెట్ తీసుకుని రెండు బస్సుల్లో ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. ఈ విధానాన్ని 137 మార్గాల్లో ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. ఒకటి, రెండు రోజుల్లో ఈ విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నారు. అయితే బస్సు మారేందుకు 2 గంటల నుంచి 22 గంటల గడువు ఉంటుంది.ఏపీఎస్ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. కొందరు ప్రయాణికులు ఆర్టీసీ బస్సులో దూర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. వారు నేరుగా బస్సు లేకపోతే మధ్యలో వేరొక చోట (నగరం, పట్టణం)లో బస్సు మారాల్సి వస్తోంది. అలాంటి వారికి ఇబ్బంది లేకుండా తమ ప్రయాణానికి సంబంధించి బస్సు మారినా సరే ఒకే టికెట్ తీసుకునే విధానాన్ని అందుబాటులోకి తెస్తున్నారు. సరికొత్తగా 'మల్టీ సిటీ జర్నీ రిజర్వేషన్' పేరిట ఆర్టీసీ రూపొందించింది.ఓ ప్రయాణికుడు అనంతపురం నుంచి శ్రీకాకుళం వెళ్లాలంటే నేరుగా వెళ్లేందుకు అవకాశం లేదు. నేరుగా బస్సు ఉండదు కాబట్టి అనంతపురం నుంచి విజయవాడ వెళ్లి.. అక్కడ మరో బస్సు మారి శ్రీకాకుళం వెళ్లాల్సి ఉంటుంది. అప్పుడు అనంతపురంలో, విజయవాడలో రెండు టికెట్లు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఆర్టీసీ తీసుకొచ్చిన కొత్త విధానంలో.. అనంతపురం నుంచి విజయవాడకు ఒక బస్సులో వచ్చి.. మళ్లీ విజయవాడ నుంచి శ్రీకాకుళంకు మరో బస్సు సర్వీసులో వెళ్లొచ్చు.అంటే బస్సు మారినా సరే ఒకే టికెట్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చు. ఇలా రెండు బస్సుల్లో ప్రయాణించేందుకు రిజర్వేషన్ చేసుకున్నా.. రిజర్వేషన్ ఛార్జి ఒక్కసారి మాత్రమే తీసుకుంటారు. ప్రయాణికులు ఒక బస్సులో బయల్దేరి.. మరొక చోట బస్సులోకి మారేందుకు 2 నుంచి 22 గంటల గడువు ఇచ్చింది ఆర్టీసీ. ప్రయాణికులు ఆ సమయాల్లో ఉన్న సర్వీసులను బట్టి ముందుగానే రిజర్వేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.ఏపీఎస్ ఆర్టీసీ మొత్తంగా 137 మార్గాల్లో ఈ విధానాన్ని అమలు చేసేందుకు సిద్ధమైంది. యూటీఎస్ మొబైల్ యాప్, ఆర్టీసీ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఈ రిజర్వేషన్లు చేసుకునేందుకు అవకాశం ఉ ంటుంది. దేశంలో తొలిసారి ఆర్టీసీల్లో.. ఏపీలో మాత్రమే ఈ విధానం తొలిసారి అమలు చేస్తున్నారు. త్వరలోనే ఈ విధానం ప్రారంభించనున్నారు. ఈ విధానం ముఖ్యంగా విమాన ప్రయాణికులకు బాగా ఉ పయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు.ఏపీఎస్ ఆర్టీసీ తొలి విడతలో ఎంపిక చేసిన రూట్లలో మాత్రమే ఈ కొత్త విధానం అమలు చేస్తోంది. ఆ తర్వాత ప్రయాణికుల స్పందనను బట్టి మిగిలిన రూట్లకు కూడా ఈ విధానాన్ని విస్తరించనున్నారు. ఆర్టీసీ ఇప్పటికే పలు కొత్త పథకాలు, ఆఫర్లతో ప్రయాణికులకు దగ్గరవుతోంది. ఇప్పుడు ఈ సరికొత్త విధానంతో మరింత దగ్గరవుతామని భావిస్తోంది. ఆర్టీసీ ఇప్పటికే నగదు రహిత లావాదేవీలను కూడా అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో సరికొత్త విధానంతో ప్రయాణికులకు చేరువ అవుతోంది.

## చైన్ స్నాచింగ్‌లో కొత్త స్టైల్

అనంతపురం, మే 7, ఇంటింటికి తిరిగి పాలు పోసే యువకుడి క్రైమ్ కహానీ బయటపడింది. పాల పోస్తున్న ఇంటికే కన్నం వేశాడు. కానీ సీన్ రివర్స్ కావడంతో పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. అనంతపురం జిల్లా ఉ రవకొండ ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ సమీపంలో ఏఏఏ అపార్ట్‌మెంట్‌లో టీచర్లు ప్రసాద్, ఉషారాణి దంపతులు నివాసం ఉంటున్నారు. గత నెల 20న ఇంటికి తాళం వేసి ఇద్దరు విధులకు వెళ్లారు.. తిరిగొచ్చి చూసేసరికి ఇంట్లో చోరీ జరిగింది.ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేశారు. ఆ అపార్ట్‌మెంటుకు వెళ్లే దారిలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించారు. అనుమానాస్పదంగా కదలికలు ఉ ండటంతో గుంతకల్లుకు వెళ్లే రోడ్డులో నివాసం ఉండే పాల వ్యాపారి ఎర్రిస్వామిని అదుపులోకి తీసుకున్నారు. అతడ్ని ప్రశ్నిస్తే.. దొంగతనం డొంక మొత్తం కదిలింది. అతడి వేలి ముద్రలు సేకరించి పోల్చి చూడగా అతడే చోరా చేశాడని తేలింది.అతడు గతంలో మరో టీచర్ విజయలక్ష్మి, విద్యుత్తు శాఖ కాంట్రాక్టర్ నాగలింగస్వామి ఇళ్లలో కూడా చోరీలు చేసినట్లు గుర్తించారు. అక్కడ దొంగతనం చేసినట్లు అతడి వేలి ముద్రల ద్వారా తేలింది. ఈ మూడు చోరీ కేసులకు సంబంధించి.. మొత్తం 21 తులాల బంగారు ఆభరణాలు, 62 తులాల వెండి ఆభరణాలతోపాటు రూ.2.48 లక్షల డబ్బును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ.14.49 లక్షలు అని పోలీసులు చెబుతున్నారు.ఎర్రిస్వామి చోరీ చేసిన సొత్తును అమ్మి ఆవులను, కెమెరా కొనుగోలు చేయాలని ప్లాన్ చేసుకున్నాడు. హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. అదే సమయంలో పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. నిందితుడిని ఉరవకొండ కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. అతడు ఉదయం సమయంలో పాల వ్యాపారం చేస్తూ.. ఆ తర్వాత ప్లాన్ చేసి పోలు పోసే ఇళ్లలోనే చోరీలు చేస్తున్నట్లు తెలుస్తోంది.మరో కేసులో ఏడునెలల బాలుడిని మంత్రాలయంలో అపహరించి గుంతకల్లులో విక్రయించిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం కాంచాపురంకు ఆంజనేయులు, అంకమ్మలు భార్యాభర్తలు. ఇద్దరు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆంజనేయులు కుటుంబంతో కలిసి మంత్రాలయం రైల్వే స్టేషన్‌లో నిద్రిస్తుండగా.. వారి కుమారుడ్ని నిందితులు అపహరించారు. అక్కడి నుంచి తీసుకెళ్లి గుంతకల్లులో వలిబాషకు రూ.3 లక్షలకు అమ్మేశారు. కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు నిందితుల కోసం గాలించి చివరికి అరెస్ట్ చేశారు.

## అనిల్... షిఫ్ట్...



నెల్లూరు, మే 7, మాజీ మంత్రి అనిల్ కుమార్ దృష్టి శ్రీ బాలాజీ జిల్లాలోని వెంకటగిరి వైపు మళ్లిందని వైసీపీ నేతలు చెవులు కొరుక్కుంటున్నారు. అయినా అనిల్ అక్కడికి వెళితే గెలిచే ఛాన్స్ లేదురా నాయనా అనుకుంటున్నారు ఆ పార్టీ నేతలు.ఇప్పటికే వెంకటగిరిలో కొమ్ములు తిరిగిన నేతలు ఖాళీగా ఉన్నారు. మాజీ సీఎం తనయుడు నేదురుమల్లి రాంకుమారెడ్డి.. వెంకటగిరి రాజాలు లాంటి ఉద్దండులు వెంకటగిరిలో ఉండగా..అనిల్ కు అక్కడ ఆదరణ లభించడం కష్టమనే ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. అనిల్ మంత్రిగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతలను పరుష పదాలతో దూషించడానికి కొంత సమయం.. నెల్లూరు జిల్లాలో సొంత పార్టీ నేతలను ఇబ్బంది పెట్టేందుకు మిగిలిన సమయం వృథా చేశాని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మంత్రి పదవి పోయే నాటికి అనిల్ కొండంత చెడ్డ పేరు మూట కట్టుకున్నారంటున్నారు. ఈ క్రమంలో నెల్లూరు నగర ప్రజలకు, వైసీపీ కార్యకర్తలకు కూడా ఆయన దూరం అయ్యారనేది వాస్తవం అని చెబుతున్నారు.నెల్లూరు నగరంలో ఆనం ఫ్యామిలీ అండతో కార్పొరేటర్ అయి.. వారి పుణ్యంతోనే అనిల్ ఎమ్మెల్యే టిక్కెట్టు సంపాదించుకున్నారు. అయితే వైసీపీ పంచన చేరిన తరువాత ఆనం ఫ్యామిలీని ఇబ్బంది పెట్టాలనే ప్రయత్నంలో జిల్లా వాసులకు అనిల్ దూరం కాక తప్పలేదంటున్నారు మంత్రిగా ఉన్నప్పుడు నెల్లూరు పెద్దారెడ్లకు కొద్దిగా కూడా అయినా మర్యాద ఇవ్వకుండా అనిల్ వ్యవహరించారట. దీన్ని మనసులో ఉంచుకున్న నెల్లూరు పెద్దారెడ్లు సమయం కోసం ఎదురు చూశారంటారు. ఆ సమయం ఇప్పుడు రానే వచ్చింది. మంత్రి పదవి పోయాక ఆ పదవి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కాకాణి గోవర్ధన్ రెడ్డికి దక్కడంతో నేతలంతా జోరీగలు తగులుకున్నట్టు అనిల్ ను తగులుకున్నారు.తాజాగా.. నెల్లూరులో ఆనం ఫ్యామిలీ ఫ్లెక్సీలతో పాటు ప్రముఖ పారిశ్రామికవేత్త ఫ్లెక్సీలు కూడా చించేయడంతో అనిల్ ఖేల్ ఖతమైందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఒకవేళ అనిల్ కుమార్ కు మళ్లీ నెల్లూరు నగరం నుంచి పోటీ చేసేందుకు టికెట్ ఇస్తే.. రెడ్లు వైఎస్సార్సీపీకి దూరం అవుతారని జగన్ చెవిలో వేశారట వేమిరెడ్డి. అంతేకాదు అనిల్ ప్రవర్తన పార్టీకి నష్టం కలిగించేలా ఉందని చెప్పారట. దీంతో ఈ సారి అనిల్ కు టికెట్ ఇవ్వకుండా పక్కన పెడదామని జగన్ చెప్పడంతో వేమిరెడ్డి, నెల్లూరు నేతలు శాంతించినట్లు తెలుస్తోంది. ఈ సారి ఆనం రామనారాయణరెడ్డి వెంకటగిరిలో పోటీచేసే అవకాశాలు చాలా తక్కువ. అక్కడ యాదవ సామాజికవర్గం ఓట్లు ఉండడంతో అక్కడికి వెళ్ళేందుకు అనిల్ ప్రయత్నాలు సాగించారు. ఇది తెలిసిన వెంకటగిరి నేతలు స్థానికేతరుడైన అనిల్ తమ నియోజకవర్గంలో పోటీ చేస్తే ఓడిస్తామని ఇప్పటికే హెచ్చరికలు చేశారని సమాచారం. దీంతో అనిల్ పని అయిపోయింది. నెక్స్ట్ ఏంటి..? పార్టీలో ఉంటారా..? లేదంటే అనిల్ నే పార్టీ పూర్తిగా పక్కన పెట్టేస్తుందా..? అని టాక్ జిల్లాలో తెగ చక్కర్లు కొడుతోంది.ఎనభై సంవత్సరాలుగా రాజకీయంగా చక్రం తిప్పిన ఆనం ఫ్యామిలీ నెల్లూరు పంటరెడ్ల జోలికి వెళ్ల లేదు. అలాంటిది కన్నూ మిన్నూ తెలియకుండా ఆనం వారితో పాటు నెల్లూరు పంటరెడ్లను అవమానకరంగా చూసిన అనిల్ కు భవిష్యత్తు ప్రశ్నార్థకం కావచ్చని అనుకుంటున్నారు. జగన్ అండ, మంత్రి పదవి శాశ్వతం అనుకున్న అనిల్ ఇప్పుడు ఒంటరైపోయి ఎన్ని ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందో..! ముందు ముందు ఇంకెన్ని పరిణామాలు జరుగుతాయో చూడాలి.. జగన్ ఫ్యాన్ గాలిలో గెలిచిన నేతలు సొంత గాలి ఉండేలా పనిచేయకపోతే.. ప్రతిసారీ.. గాలి ఉండదు కదబ్బా అంటున్నారు కొందరు.

## సెల్ఫీ పాలిటిక్స్...

గుంటూరు, మే 8, ఏపీలో సెల్ఫీ పాలిటిక్స్ కాకరేపుతున్నాయి. అయితే ఓ డాక్టర్ సెల్ఫీ ఛాలెంజ్ పొలిటికల్ హీట్ పుట్టించింది. డాక్టర్ వీడియో రెండు పార్టీల్లో కలకలం రేపుతోంది. ఆయన సవాల్ ఎవరికన్నది చర్చకు దారి తీసింది. ఇంకా చెప్పాలంటే ప్రస్తుతం ఏపీలో రాజకీయాల్లో ఇప్పుడు సెల్ఫీ ఛాలెంజ్ ట్రెండ్ నడుస్తోంది.

అధికార, విపక్ష పార్టీల నేతలు ఇప్పుడు పోటీపడి సెల్ఫీ ఛాలెంజ్‌లు విసురుకుంటున్నారు. గుంటూరు జిల్లా గురజాల నియోజకవర్గం పిడుగురాళ్ళలో ఈ సెల్ఫీ ల ఛాలెంజ్ తారాస్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో పల్నాడు హాస్పిటల్స్ అధినేత డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్? రియల్ సెల్ఫీ ఛాలెంజ్ పేరుతో ఒక వీడియో రిలీజ్ చేశారు. ఈ వీడియోపై పల్నాడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కొన్నేళ్లుగా గురజాల నియోజకవర్గంలో అక్రమ మైనింగ్‌ని ప్రోత్సహించింది ఎవరు..? కేసులు పెట్టింది ఎవరి మీదా..? పేరొందిన లైం సిటీని దిక్కుతోచని స్థితిలో పడేసింది ఎవరు..?ప్రస్తుత మైనింగ్ పై ఆంక్షలు పెడుతున్నది ఎవరు..? పర్మిషన్స్‌కి మించి మైనింగ్ చేసింది ఎవరు..? అభం శుభం తెలియని ముక్కుపచ్చలారని పిల్లలను పొట్టన పెట్టుకుంది ఎవరు..? ఇప్పటివరకు మేము అక్రమ మైనింగ్ చేయలేదని చెప్పే ధైర్యం ఏ నాయకునికైనా వుందా..? వచ్చే ఎన్నికల్లో గెలిస్తే ఎవరి వ్యాపారం జోలికి మేము పోము అని చెప్పే సత్తా ఏ నాయకునికైనా వుందా..? మాకుంది.. మేము చెప్తాం.. వచ్చే ఎన్నికల్లో గెలిస్తే ఏ వ్యాపారి జోలు మేము పోము.. నా సవాల్ ని ఏ నాయకుడైనా స్వీకరిస్తే.. ఇలానే సెల్ఫీ వీడియో తీయాలంటూ డాక్టర్ అశోక్ వీడియో విడుదల చేయడం కలకలం రేపింది. టీడీపీ యరపతినేని, వైసీపీ ఎమ్మెల్యే కాసు మహేష్ నేతలిద్ధరికీ సవాల్ విసిరి తాము మూడో ప్రత్యామ్నాయం అనే విధంగా ఉండటంతో చర్చనీయాంశంగా మారింది.

## ఏపీ డిస్కమ్ లు దివాళా?

గుంటూరు, మే 7, జగన్ సర్కార్ విద్యుత్ సంస్థలకు డబ్బులు ఎగ్గొట్టేందుకు కొత్త పన్నాగం పన్నింది. ఏపీ డిస్కమ్ లు దివాళా తీశాయనీ, చెల్లింపులకు డబ్బులు లేవనీ చెబుతోంది. ఏపీ విద్యుత్ సంస్థలు ఏకంగా తమకు విద్యుత్ సరఫరా చేసిన సంస్థలకు చెల్లించేందుకు తమ వద్ద డబ్బులు లేవని కోర్టుకు విన్నవించాయి.  వాస్తవానికి సాంప్రదాయేతర విద్యుత్ సంస్థల నుంచి కొనుగోలు చేసిన విద్యుత్ కు పీపీఏల ప్రకారం చెల్లింపులు చేసి తీరాల్సిందేనని గత మార్చి 15న విస్పష్ట తీర్పు ఇచ్చిన ఏపీ హై కోర్టు ఆ చెల్లింపులకు ఆరు వారాల గడువు ఇచ్చింది.అయితే ఆ తీర్పును ఏ మాత్రం ఖాతరు చేయని ప్రభుత్వం ఈ ఆరు వారాల పాటూ ఎటువంటి చెల్లింపులూ చేయలేదు. ఇప్పుడు తమ వద్ద డబ్బులు లేని కారణంగా చెల్లింపు చేయలేని పరిస్థితి ఉందని కోర్టుకు చెబుతోంది. వాస్తవానికి గత ప్రభుత్వం సాంప్రదాయేతర విద్యుత్ సంస్థలతో చేసుకున్న పీపీఏలను వైసీపీ సర్కార్ అధికారంలోకి రాగానే రద్దు చేసింది. ఆ సంస్థలు కోర్టును ఆశ్రయించడంతో కోర్టు పీపీఏల ప్రకారం ముందుకు పోవలసిందేనని తీర్పు ఇచ్చింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం బిల్లులు చెల్లించడం నిలిపివేసింది. దీంతో ఆ కంపెనీలు మళ్లీ కోర్టును ఆశ్రయించాయి. ఈ సారి కోర్టు మరింత విస్పష్టంగా పీపీఏల ప్రకారం చెల్లింపులు చేయాలని, బకాయిలు, భవిష్యత్ లో ధరలు కూడా పీపీఏలలో పేర్కొన్న ప్రకారమే చెల్లించాలని తేల్చి చెప్పింది. దీంతో ఏపీ సర్కార్ విద్యుత్ కంపెనీలకు చెల్లించాల్సిన  బకాయిలు రమారమి రూ.20 వేల కోట్లుగా తేలింది. కోర్టు ఆదేశాల మేరకు ఆ సొమ్ము చెల్లించి తీరాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది. ఇదిగో ఇక్కడే సర్కార్ కొత్త ఎత్తుగడకు తెరలేపింది. డిస్కమ్ లు రుణాల ఊబిలో కూరుకున్నాయనీ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న డిస్కమ్ లు ఇప్పుడు చెల్లింపులు చేసే పరిస్థితిలో లేవనీ కోర్టుకు విన్నవించుకుంది. వాస్తవానికి ఏపీ సర్కార్ పీపీఏల బకాయిలు ఎగ్గొట్టే ఎత్తుగడతోనే వాటి నుంచి విద్యుత్ తీసుకోకుండా అంతకంటే అధికదర చెల్లించి బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోలు చేసిన సందర్భాలు బోలెడున్నాయి.పీపీఏల విషయంలో ఏపీ తీరును కేంద్రం కూడా ఆక్షేపించింది. పీపీఏలను సమీక్షించడం సరికాదని జగన్ సర్కార్ ను హెచ్చరించింది. దీని వల్ల పెట్టుబడిదారులు ఏపీని బ్లాక్ లిస్ట్ లో పెట్టే ప్రమాదం ఉందని హెచ్చరించింది. అయినా వినకుండా జగన్ సర్కాన్ మూర్ఖత్వంతోనో, మొండి తనంతోనో, గత ప్రభుత్వంవి అన్నీ రద్దు చేయాలన్న ఉద్దేశంతోనో పీపీఏల సమీక్షతో ముందుకు సాగింది. ఫలితమే ఇప్పుడు రాష్ట్రంలో విద్యుత్ పరిస్థితి, అలాగే పీపీఏలకు భారీ మొత్తంలో బకాయిలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఇప్పుడు కోర్టులో ఏపీ వాదనపై తీర్పు ఏ విధంగా వస్తుందన్నది వేచి చూడాలి.

## అదుపు తప్పి లారీ బోల్తా

ఒంగోలు ప్రకాశం జిల్లా కొమరోలు మండలం ఎడమకల్లు సమీపంలోని కడప అమరావతి రహదారిపై లారీ అదుపుతప్పి రోడ్డు పక్కకు వెళ్లి బోల్తా బద్ద సంఘటన సోమవారం ఉదయం జరిగింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ కు స్వల్ప గాయాలు అయ్యాయి. జరిగిన రోడ్డు ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం చోటు చేసుకున్న సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## ఎడారిగా శ్రీ శైలం మారనుందా..

కర్నూలు, మే 7, నీటి కేటాయింపులు లేకుండా.. 29.9 టీఎంసీల తుంగభద్ర జలాలను వాడుకోవడానికి కర్ణాటక సర్కార్ చేపట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతి ఇవ్వడంలో, జాతీయ హోదా కల్పించడంలో కేంద్ర జల్ శక్తి శాఖ వ్యవహరించిన తీరును దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సులో లేవనెత్తాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు నిర్ణయించాయి. అప్పర్ భద్ర పూర్తయితే తుంగభద్ర డ్యామ్ ఆయకట్టుతోపాటు తెలుగు రాష్ట్రాల్లో కృష్ణా బేసిన్‌లో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఏర్పడతాయని వివరించనున్నాయి. తుంగభద్ర డ్యామ్‌కు ఎగువన 295 టీఎంసీలకు మించి కర్ణాటక వాడుకోవడానికి వీల్లేదని బచావత్ ట్రిబ్యునల్ స్పష్టం చేస్తే.. 1980?81 నాటికే 319.558 టీఎంసీలను కర్ణాటక వినియోగిస్తున్నట్లు బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునలే తేల్చింది. కానీ.. విజయనగర చానళ్లు, తుంగ, భద్ర ఆనకట్టల ఆధునికీకరణ వల్ల 11.5 టీఎంసీలు మిగిలాయని, 65 శాతం లభ్యత ఆధారంగా బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ (తీర్పు ఇంకా అమల్లోకి రాలేదు) కేటాయించిన పది టీఎంసీలు, పోలవరం నుంచి కృష్ణా డెల్టాకు మళ్లించిన గోదావరి జలాలకుగానూ దక్కిన 21 టీఎంసీల్లో 2.4 టీఎంసీలు, కే?8, కే?9 బేసిన్‌లలో మిగిలిన 6 టీఎంసీలు వెరసి.. 29.9 టీఎంసీలు (ఆవిరి నష్టాలు పోనూ) తరలించేలా అప్పర్ భద్ర చేపట్టామని కర్ణాటక ప్రతిపాదించింది.అప్పర్ తుంగ నుంచి 17.40 టీఎంసీలను భద్ర ప్రాజెక్టులోకి ఎత్తిపోసి అక్కడి నుంచి 29.90 టీఎంసీలను తరలించి దుర్భిక్ష ప్రాంతాల్లో 2.25 లక్షల హెక్టార్లకు నీళ్లందించేలా ఈ ప్రాజెక్టును చేపట్టామని పేర్కొంది. ఈ ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతి ఇవ్వాలంటే.. బేసిన్ పరిధిలోని మహారాష్ట్ర, ఏపీ, తెలంగాణ అభిప్రాయం తీసుకోవాలి. కానీ.. ఈ రాష్ట్రాల అభిప్రాయం తీసుకోకుండానే 2020, డిసెంబర్ 24న కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక అనుమతి ఇచ్చేసింది. విజయనగర చానళ్లు, తుంగ, భద్ర ఆనకట్టల ఆధునికకీరణ వల్ల నీళ్లు మిగల్లేదని.. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు అమల్లోకి రాలేదని.. ఈ నేపథ్యంలో ఆ ప్రాజెక్టుకు ఎలా అనుమతి ఇస్తారని ఏపీ, తెలంగాణ వ్యక్తం చేసిన అభ్యంతరాలను సీడబ్ల్యూసీ తోసిపుచ్చింది. సీడబ్ల్యూసీ ఇచ్చిన నివేదిక ఆధారంగా.. అప్పర్ భద్రను 2018?19 ధరల ప్రకారం రూ.16,125 కోట్లతో చేపట్టేందుకు 2021, మార్చి 25న కేంద్ర జల్ శక్తి శాఖ అనుమతి ఇచ్చింది. అంతేకాకుండా ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కర్ణాటక చేసిన ప్రతిపాదనపై ఆ శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ నేతృత్వంలోని హైపవర్ కమిటీ ఆమోదముద్ర వేసింది. ఈ ప్రాజెక్టుకు అయ్యే వ్యయం రూ.12,500 కోట్లను అందించడానికి కేంద్రం సమ్మతించింది.అప్పర్ భద్ర పూర్తయితే.. తుంగభద్ర డ్యామ్‌కు, శ్రీశైలానికి వరద ప్రవాహం రావడంతో మరింత జాప్యం జరుగుతుంది. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే దిగువకు వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉండదు. ఇది తుంగభద్ర డ్యామ్‌పై ఆధారపడిన ఏపీలోని ఆయకట్టుతోపాటు కృష్ణా బేసిన్‌లో తెలుగు రాష్ట్రాల్లో సాగు, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయి.

# ఆ ముగ్గురు చూపు అసెంబ్లీ నియోజకవర్గాలపైనే..!

కాకినాడ, మే 8, వారిలో ఇద్దరు రాజకీయానికి కొత్త.. ఒకరు గతంలో ఎమ్మెల్యేగా, జడ్పీ ఛైర్మన్‌గా పనిచేశారు.. అయితే అంతా అనుకోకుండా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఎంపీ అభ్యర్థులుగా ప్రకటించారు. అంతే అనూహ్యంగా గెలుపొందారు.. కానీ ఎక్కడో అసంతృప్తో లేక ఎమ్మెల్యేగా గెలుచుంటే మంత్రి పదవి దక్కేదనో మొత్తం మీద ఈసారి ఎన్నికల్లో ఏది ఏమైనా ఎమ్మెల్యేగా పోటీ చేయాలని డిసైడ్ అయిపోయారట. ఏడు నియోజకవర్గాలకు ఎంపీగా ఉండేకంటే ఒక్క నియోజకవర్గంలో తానే రాజు తానే మంత్రిగా కొనసాగడమే బెటర్ అన్న నిర్ణయానికి వచ్చారనుకుంటున్నారట.. ఇంతకీ ఎంపీ పదవిపై ఎందుకో నిరాసక్తత. ఎమ్మెల్యే పదవిపై ఎందుకో ఆతృత.. మొత్తం మీద రాబోయే ఎన్నికలకోసం ఎవరి కసరత్తులు వారు ప్రారంభించినట్లు తెలుస్తోంది.కాకినాడ పార్లమెంటు నియోజకవర్గంలో గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా పళ్లంరాజు కేంద్రమంత్రిగా పనిచేశారు. ఆతరువాత రాష్ట్రవిభజన తరువాత 2014లో టీడీపీ తరపున తోట నరసింహారావును ఎంపీ స్థానానికి పోటీలోకి దింపింది టీడీపీ అధిష్టానం. వైసీపీ తరపున పోటీచేసిన సునీల్ ఓడిపోవడంతో పార్టీకు దూరమయ్యారు. అయితే కాకినాడ నుంచి ఎంపీ అభ్యర్థిత్వానికి సరైన అభ్యర్థి వైసీపీ వెతుక్కోవ్వాల్సి వచ్చింది.. దీంతో అప్పటికే పార్టీలో చేరి ఎక్కడో ఓ చోట ఎమ్మెల్యే సీటు ఇవ్వాలని కోరిన వంగా గీతకు అనూహ్యంగా కాకినాడ ఎంపీ సీటు దక్కింది. తక్కువ సమయంలో సీటు దక్కించుకున్నా జగన్ మానియాలో గెలుపు నల్లేరుమీద నడకలానే వరించింది.. కాకినాడ పార్లమెంటు నియోజకవర్గంలో అందరి శాసన సభ్యులతో సఖ్యతగానే ఉంటోన్న ఎంపీ వంగా గీత ఈ సారి ఎమ్మెల్యేగా పోటీచేయాలని అనుకుంటున్నారట. దీనికోసమే తాను గతంలో ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీచేసి గెలుపొందిన పిఠాపురంలో పోటీచేయాలని ఆకాంక్షిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నియోజకవర్గంలో ఉన్న పరిచయాల నేపథ్యంలో ఎంపీ ల్యాడ్స్ నుంచి కూడా అత్యధికంగా పిఠాపురం నియోజకవర్గానికి నిధులు కేటాయించడం వెనుక కూడా ఎంపీ గీత స్కెచ్ ఉందని గుసగుసలు వినిపిస్తున్నాయి. పిఠాపురం నుంచి పెండెం దొరబాబు ఉన్నా అధిష్టానం ఓకే అంటే పోటీ చేసేందుకు తాను సిద్ధం అంటున్నారట ఎంపీ వంగా గీత.రాజమండ్రి పార్లమెంటు స్థానం నుంచి నూనతంగా రాజకీయాల్లోకి రంగప్రవేశం చేసిన మార్గాని భరత్‌రామ్ వైసీపీ నుంచి పోటీచేసి గెలుపొందారు. అయితే అనేహ్యంగా రాజమండ్రి అర్బన్, రూరల్ రెండు అసెంబ్లీ స్థానాలు టీడీపీ గెలుపోందాయి. దీంతో అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా ఎంపీ మార్గాని భరత్ తన ప్రభావాన్ని చూపుతున్నారు. అధికారిక కార్యక్రమాలకు తానే అన్నీ అయ్యి చేస్తుండడంతో ఆయనకు ఎటువంటి అసమ్మతి సెగ లేకపోగా రాజమండ్రి కేంద్రంగా రాజకీయంగా దూసుకుపోతున్నారు. అయితే ఆమధ్య రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు ఎంపీ భరత్‌కు మధ్య కొంత మనస్పర్ధలు వచ్చిన క్రమంలో ఇద్దరూ రచ్చకెక్కిన నేపథ్యంలో అధిష్టానం ఇద్దరినీ పిలిచి అక్షింతలు వేయడంతో ఆ వివాదం కాస్త సద్దుమనిగింది. రాజమండ్రి నుంచి తరచూ పార్టీ వాయిస్ వినిపిస్తున్న ఎంపీ మార్గాని భరత్ తాను వచ్చే ఎన్నికల్లో రాజమండ్రి అర్బన్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయాలని ప్రయత్నాల్లో ఉన్నారట. ఈనేపథ్యంలోనే రాజమండ్రి సిటీ వేదికగా ఎంపీ ల్యాడ్స్ నుంచే కాక అనేక సీఎస్సార్ నిధుల ద్వారా కూడా అగ్రభాగం రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్‌కు వినియోగిస్తున్నారని తెలుస్తోంది.ఈ సారి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందితే మంత్రి పదవి దక్కించుకోవాలన్న ఆకాంక్షతోనే ఆయన ఎమ్మెల్యేగా పోటీచేసేందుకు గట్టి పట్టుదలతో ఉన్నారని ప్రచారం జరుగుతోంది.. దీనికి తోడు టీడీపీనుంచి ఈసారి ఆదిరెడ్డి భవానీకు బదులు ఆమె భర్త పోటీచేస్తానని ప్రకటించడం కూడా జరిగింది. కొసమెరుపేంటంటే మార్గాని భరత్ గనుక ఎంపీగా పోటీచేస్తే ఈసారి రాజమండ్రి నుంచి తానే రంగంలోకి దిగుతానని వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణంరాజు ప్రకటించడం విశేషం. అమలాపురం పార్లమెంటు నియోజకవర్గానికి ఎవ్వరు పోటీచేసినా స్థానికులు కానివారే నెగ్గిన పరిస్థితి ఉంది. గతంలో రాజమండ్రికి చెందిన జీవీ హర్షకుమార్ రెండుసార్లు ఎంపీగా పనిచేశారు. ఆతరువాత టీడీపీ తరుపున పండుల రవీంద్రబాబుకూడా విశాఖ నుంచి వచ్చి పోటీచేసి గెలుపొందారు. 2019 ఎన్నికల నాటికిపార్లమెంటరీ నియోజకవర్గంకు అనూహ్యంగా చింతా అనురాధ పేరు తెరమీదకు వచ్చి ఆమె పోటీచేశారు. నిజానికి అనురాధ ఎస్సీ రిజర్వుడు స్థానం ఏదైనా అసెంబ్లీ స్థానం నుంచి తనకు టిక్కెట్టు కేటాయించాలని పట్టుపట్టినా అప్పటికే అన్ని నియోకవర్గాల్లో పాతుకుపోయిన అభ్యర్థులు ఉండడం వల్ల అది సాధ్యం కాలేదు. అయితే తప్పక ఎంపీగా పోటీచేసిన అనురాధ ముక్కోణపు పోటీల్లో విజయం సాధించారు.బాలయోగి వారసునిగా తెరమీదకు వచ్చిన ఆయన తనయుడు గట్టిపోటీ ఇచ్చినా మొత్తంమీద గెలుపొందారు. అయితే ఆమె స్వస్థలం అమలానురం నియోజకర్గం కాగా ఎక్కువ దృష్టి అంతా ఇక్కడే పెట్టడం, నిధులు కేటాయించడం వంటి చర్యలతో మంత్రి విశ్వరూప్‌కు, ఎంపీ అనురాధ మధ్య పొరపొచ్చలు తీవ్రంగా వచ్చాయని ఆమాధ్య ప్రచారం జరిగింది. ఆతరువాత ఆవ్యవహారాలు సద్దుమనిగినా మళ్లీ ఈ మధ్యకాలంలో మళ్లీ పునరావృతం అయ్యిందని, ఇద్దరి మధ్య అంతగా సఖ్యత లేదన్నది కొన్ని పరిణామాలను బట్టి బహిర్గతం అయ్యిందనే చెప్పవచ్చు. ప్రస్తుతం ఎంపీ అనురాధ పి.గన్నవరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టిక్కెట్టు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. లేకపోతే మంత్రి విశ్వరూప్ పోటీచేయకుండా ఆయన తనయుడ్ని రంగంలోకి దింపితే ఆయన్ను పి.గన్నవరం పంపి అమలాపురం తనకే ఇవ్వాలని కోరుతున్నట్లు కూడా చర్చ జరుగుతోంది. ఏదిఏమైనా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎంపీలు ఎమ్మెల్యేలుగా పోటీ చేసేందుకు మక్కువ చూపడంతో తీవ్ర చర్చ జరుగుతోంది..

## తెలుగు నేతల హడావిడి

బెంగళూరు, మే 8, కర్ణాటక ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాల నేతలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కొంత మంది సినీ నటులు కూడా ప్రచారం చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ ముఖ్య నేతలు బెంగళూరులోనే మకాం వేశారు. తెలంగాణ బీజేపీ ముఖ్య నేత, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బెంగళూరులో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఏపీ నుంచి ఆ పార్టీ ఏపీ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి కూడా పర్యటిస్తున్నారు. తెలుగు కమ్యూనిటీలతో సమావేశాలు నిర్వహిస్తూ బీజేపీకే మద్దతివ్వాలని కోరుతున్నారు. ఉత్తర కర్ణాటకలోని చిక్ బళ్లాపూర్, హోసూర్, కోలార్, బీదర్, గంగావతి, రాయచూర్, కొప్పోల్, గుల్బర్గా, వంటి చాలా ప్రాంతాల్లో తెలుగు వారే ఎక్కువగా ఉన్నారు. అక్కడ చాలా మంది కన్నడ వారు కూడా తెలుగు మాట్లాడగలరు. అందువల్ల సరిహద్దు ప్రాంతాల్లో తెలుగు రాష్ట్రాల నేతలు ప్రచారానికి వెళ్తున్నారు. రెండు రోజుల్లో ప్రచారం ముగుస్తుంది. అందుకే కీలక నేతలంతా అక్కడే మకాం వేశారు. ఏపీ బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి ప్రచారం ప్రారంభమయినప్పటి నుండి అక్కడే ఉన్నారు. ప్రధాని మోదీ పర్యటనల్లో ఆయన బాధ్యతలు నిర్వహించారు. సోము వీర్రాజు సహా పలువురు నేతలు కర్ణాటకలో ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్ నుంచి పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి... కర్ణాటక కాంగ్రెస్ నేత శివకుమార్‌తో కలిసి ప్రచారం, ర్యాలీల్లో పాల్గొంటున్నారు. బీజేపీ తరపున బ్రహ్మానందం చిక్ బళ్లాపూర్‌లో ప్రచారం చేశారు. చిక్కబళ్లాపూర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి సుధాకర్ కు మద్దతుగా ప్రచారం చేశారు. సుధాకర్ ఎంతో మంచివాడని.. ఆయన చేసిన మంచి పనులను గుర్తు పెట్టుకుని ఈ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ప్రచారంలో బ్రహ్మానందం సినిమా డైలాగ్ చెప్పి అలరించారు. ఖాన్స్ తో గేమ్స్ ఆడొద్దు శాల్తీలు లేచిపోతయ్ అని అనడంతో ఫ్యాన్స్ ఈలలు వేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రచారం చేస్తారన్న ప్రచారం జరిగినప్పటికీ అదేమీ లేదని తేలిపోయింది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు మే 10 న జరగనుండగా, మే 13న ఫలితాలు విడుదల కానున్నాయి. పోటీ ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్? మధ్యే ఉండనుంది. కాగా రాజకీయ పార్టీలు ఆరోపణలు ప్రత్యారోపణలు చేసుకుంటూ రాజకీయాన్ని వేడెక్కిస్తున్నాయి. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్? అగ్రనేతలు ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

## విపత్తు సాయంలో నిర్లక్ష్యం

### నేటికీ అందని పంట నష్టం

### ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపు

విజయవాడ,మే8 : విడతలు విడతల్లో కురిసిన వర్షాలు పైర్లను ఆగమాగం చేశాయి. గడచిన రెండు మూడు రోజుల్లో పడ్డ వానలకు పొలాల్లోని పంటలు దెబ్బతినడం ఒక ఎత్తుకాగా కల్లాల్లో కోసి ఆరబెట్టిన, చివరికి మార్కెట్ యార్డుల్లో ఆరబోసిన వరి ధాన్యం, మొక్కజొన్న, మిరప, పసుపు, పత్తి, వేరుశనగ పంటలు వానలకు నానడం మరో ఎత్తు. అక్కడక్కడ మొలకలు సైతం వచ్చాయి. ఉద్యానవన పంటలు మామిడి, అరటి, బొప్పాయి, బత్తాయి తోటలు దెబ్బ తిన్నాయి. పధ్నాలుగు జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. పంట నష్టం భారీగా ఉంటుందని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. విపత్తుల వలన పంటలు నష్టపోయిన రైతులకు ఎప్పటికప్పుడే పరిహారం చెల్లిస్తామన్న ప్రభుత్వం అలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అరకొర పంపిణీ చేస్తోంది. మార్చిలో కురిసిన వానల నష్టం అంచనాలు ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ లోపు ఏప్రిల్ 23 నుంచి రాష్ట్రంలో ఎక్కడోక్కడ వానలు పడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా మూడు రోజుల్లో భారీ వర్షాలు పడ్డాయి. ఎట్టకేలకు సమీక్షించిన ముఖ్యమంత్రి జగన్, రైతులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు తప్ప ఎలాగో స్పష్టత ఇవ్వలేదు. ధాన్యాన్ని కొంటామన్న కనీస భరోసా సైతం రైతులకు జగన్ కల్పించలేదు. గతంలో విపత్తులొచ్చిన వెంటనే అధికారులు ఏయే పంటలు ఎంతెంత విస్తీర్ణంలో ఎక్కడెక్కడ దెబ్బతిన్నాయో ప్రాథమిక అంచనాలు వెల్లడించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఇ-క్రాప్‌లో నమోదు చేసిన పంటలు నష్టపోతేనే పరిహారం ఇస్తున్నందున, అంత వరకే నష్టం జరిగిందం టున్నారు. మిగతా నష్టాలను కనీసం పరిగణనలోకి తీసుకోవట్లేదు. కౌలు రైతుల పంట పొలాలు మునిగినా అవి ఇ-క్రాప్‌లో నమోదు కావట్లేదు కనుక ఆ నష్టాలను వదిలేస్తున్నారు. సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న రైతాంగంపై అకాల వర్షాలు గోరుచుట్టుపై రోకలి పోటుగా మారాయి. ఇటీవలికాలంలో ఎన్నడూ లేని విధంగా ఈ మారు లక్షలాది ఎకరాల్లో రబీ సాగు తగ్గగా, నకిలీ, కల్తీ విత్తనాలు, ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, పెట్రో ధరాఘాతం, ప్రభుత్వ నిరాదరణ.. ఈ అవాంతరాలన్నీ దాటుకొని పండించిన పంటలను భారీ వానలు ముంచెత్తాయి. ఈదురుగాలులు, వడగండ్ల దాడితో లక్షలాది ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యానవన పంటలు నీటిపాలయ్యాయి. చేతికొచ్చిన పంట కళ్ల ముందే తడిసి ముద్దవడంతో అన్నదాతల గుండె చెరువైంది. ఈ వేసవిలో కాలం కాని కాలంలో ఎన్యూమరేషన్‌లో పారదర్శకత పాటించకుండా లబ్దిదారుల ఎంపిక పూర్తయ్యేంత వరకు సమాచారం గుంభనంగా ఉంచుతున్నారు. కోసి ఆరబెట్టిన పంటలకు పరిహారం రాదంటున్నారు. మామిడి, బత్తాయి ఇత్యాది పండ్లు నేల రాలడం వలన రైతులకు అపార నష్టం వాటిల్లినా ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వరట. పూర్తిగా చెట్లు పడిపోతేనే సహాయం. స్కేల్ ఆఫ్ ఫ÷నాన్స్ ఎప్పుడో 2014లో నిర్ణయించిందే ఇప్పుడూ అమలు చేస్తున్నారు. 33 శాతం పంట దెబ్బతింటేనే ఇస్తారు. ఎకరా వరి, పత్తి, మిర్చి పంటలకు ప్రభుత్వం ఇచ్చేది రూ.6 వేలు. తోటలకైతే రూ.8 వేలు. ఈ మాత్రం దానికి పలు నిబంధనలు. కేంద్రం నిర్ణయించిన పరిహారం ఇంకా ఇంకా తక్కువ. అసలు కేంద్రం రాష్ట్రం పంపిన వినతులపై స్పందించట్లేదు. కేంద్ర బృందాలొచ్చినా నామ్ కే వాస్తే రిపోర్టులిచ్చి చేతులు దులుపు కుంటున్నాయి. కేంద్రం కొత్తగా నిధులివ్వకుండా అడ్వాన్సులు, పాత బకాయిల కింద జమ వేసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం తన నిధులతో రైతులకు అరకొర పరిహారం అందిస్తోంది. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు సముచిత స్థాయిలో పరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలి. త్వరితగతిన బీమా చెల్లించాలి. కఠిన నిబంధనలు తొలగించాలి. రంగుమారిన, తడిసిన ధాన్యం కొనుగోలుకు కేంద్రంతో మాట్లాడి నాణ్యతా ప్రమాణాలు సడలించేలా చర్యలు తీసుకోవాలి.

## రాజస్థాన్ లో కూలిన ఇండియన్ ఎయిర్ ఫోర్స్ మిగ్ -21 విమానం.. నలుగురు మృతి

జైపూర్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ మిగ్-21 విమానం సోమవారం రాజస్థాన్ రాష్ట్రంలోని హనుమాన్ ఘడ్ జిల్లాలో కుప్పకూలిపోయింది.ఈ ప్రమాదం నుంచి ఎయిర్ ఫోర్స్ మిగ్-21 విమాన పైలట్ సురక్షితంగా బయటపడ్డాడు. పైలట్ పారాచూట్ సహాయంతో కిందకు దూకటంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విమానం కూలిన ఘటనలో స్థానికులు నలుగురు మరణించారు.పలువురు గాయపడ్డారు. విమానం గ్రామ శివారులోని ఓ ఇంటిపై కూలడంతో నలుగురు పౌరులు మరణించారు. ఎయిర్ ఫోర్స్ విమానం కూలిన ప్రాంతానికి ఆర్మీ హెలికాప్టర్ వచ్చి సహాయ చర్యలు చేపట్టింది. ఈ మిగ్ విమానం సూరత్ ఘడ్ నుంచి బయలుదేరి ప్రమాదానికి గురైంది, గత జనవరి నెలలో రాజస్థాన్ రాష్ట్రంలోని భరత్ పూర్ లో రెండు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఫైటర్ జెట్ సుఖోయ్ 30 మిరాజ్ 2000 విమానాలు కూలిన ఘటనలో ఓ పైలట్ మరణించారు.

## బాలినేని రూటెటు...



ఒంగోలు, మే 8, తనపై కొంతమంది కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వారెవరో కాదు, పార్టీ మనుషులే. నన్ను కావాలనే ఇబ్బంది పెడుతున్నారు. వారి పేర్లు నేను బయటకు చెప్పను, పార్టీని ఇబ్బంది పెట్టను. కానీ అధిష్టానం ఇలాంటిప్రచారాలను అడ్డుకోవాలి, వారి విషయంలో నిర్ణయం తీసుకోవాలి. " ఇదీ మాజీ మంత్రి బాలినేని ప్రెస్ మీట్ సారాంశం. మరి ఆయన చెప్పినట్టు అధిష్టానం ఆ దిశగా చర్యలు తీసుకుంటుంగా, ఆయనపై ఆరోపణలు చేసేవారు, తప్పుడు ప్రచారం చేసేవారిపై కఠినంగా వ్యవహరిస్తుందా..?బాలినేని వ్యవహారంలో పార్టీ అనుకూల మీడియా చాలా తెలివిగా వ్యవహరించింది. ఆయన నేరుగా పార్టీలోని నేతలు తనను ఇబ్బంది పెట్టారని కుండబద్దలు కొట్టారు. కానీ, వైసీపీ అనుకూల మీడియాతో మాత్రం ఆ పని ప్రతిపక్షనేతలెవరో చేసినట్టు కథనాలిచ్చారు. బాలినేని బాధపడ్డారన్నారే కానీ, ఆ బాధకు కారణం వైసీపీ నేతలే అనే విషయం మాత్రం దాచి ఉంచారు. అధిష్టానానికి ఆయన చేసిన సూచన కూడా హైలెట్ కాలేదు. ఒకరకంగా వైసీపీ దూరం పెట్టాలనుకుంటున్న నేతలెవరికీ సాక్షి సరైన కవరేజ్ ఇవ్వదు. ఆనం రామనారాయణ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సహా ఇతర నేతల విషయంలో కూడా ఇదే రుజువైంది. ఇప్పుడు బాలినేని వ్యవహారంలో కూడా అదే జరిగింది. ఆయన చెప్పిన అసలు విషయాన్ని మాత్రం హైలెట్ చేయలేదు. ఏదో మొహమాటానికి బాలినేని ఏడ్చారన్నట్టుగా వార్త ఇచ్చారు. అంటే పార్టీ దాదాపుగా బాలినేనిని పక్కనపెట్టడానికే డిసైడ్ అయిందనుకోవాలి. అసలు కప్పులో టీ లేదు, అందులో తుఫాన్ ఎక్కడిది అని ప్రశ్నించిన సజ్జల, బాలినేని ప్రెస్ మీట్లో బాధపడిన తర్వాత మాత్రం రియాక్ట్ కాలేదు. అంతా మీడియా ఊహాగానాలే అన్న పార్టీ ప్రధాన కార్యదర్శి బాలినేని విషయంలో ఏమని సమాధానం చెబుతారో చూడాలి. ఆయన్ను పక్కనపెట్టాలని భావిస్తే మాత్రం ఈ వ్యవహారంపై ఎవరూ నోరు తెరిచే సాహసం చేయరు. పార్టీ ఉద్దేశమేంటో తెలిసిన తర్వాతే నాయకులంతా ఒకరి తర్వాత ఒకరు రియాక్ట్ అవుతారు. ఈ రెండు రోజుల్లో దాదాపుగా పార్టీ నిర్ణయం ఏంటనేది తేలిపోతుంది. దాని ద్వారా బాలినేని భవిష్యత్తు కూడా తేలిపోతుంది. ఐదుసార్లు ఎమ్మెల్యే, రెండుసార్లు మంత్రి.. ఇలాంటి నేత ఎవరైనా ఎంత స్ట్రాంగ్ గా ఉంటారు. కానీ బాలినేని ప్రెస్ మీట్ లో బేలగా మారిపోయారు. ఒకరకంగా ఆయన సింపతీకోసం ఎదురు చూస్తున్నారని తేలిపోయింది. కార్యకర్తలు, అభిమానులకోసం ఎందాకైనా పోరాడతానన్నారు. అంటే వారికోసమే తాను భవిష్యత్ నిర్ణయం తీసుకుంటానని ఇన్ డైరెక్ట్ గా హింట్ ఇచ్చారు. ప్రస్తుతానికి పుకార్లే అని బాలినేని స్వయంగా చెబుతున్నా, ఆయన టీడీపీ, జనసేనతో టచ్ లో ఉన్నారనే మాటలు బలంగా వినపడుతున్నాయి. ఒకవేళ ఆయన వైసీపీని కాదనుకుంటే, కచ్చితంగా ఆరెండు పార్టీల్లో ఏదో ఒకదానిని సెలక్ట్ చేసుకోవాల్సిందే. మరి బాలినేని ఎటువైపు వెళ్తారు, ఏ పార్టీ తీర్థం పుచ్చుకుంటారు. మరికొన్ని రోజుల్లో తేలిపోతుంది. బాలినేని వైసీపీని వీడితే అది కచ్చితంగా వైసీపీకి పెద్ద మైనస్ అనే చెప్పాలి. మిగతా నాయకులు వెళ్లిపోయినా జగన్ లైట్ తీసుకున్నారు, మరి బాలినేని వ్యవహారంలో ఆయన బుజ్జగింపులకు దిగుతారా లేక గతంలో జరిగిన మీటింగే ఫైనల్ అనుకోవాలా అనేది తేలాల్సి ఉంది

## తెలంగాణలో అలా...ఏపీలో ఇలా

విజయవాడ, మే 8, ఎండా కాలం వానలు తెలుగు రాష్ట్రాల్లో రైతుల్ని నిండా ముంచేశాయి. ఆరబెట్టుకున్న ధాన్యం నీళ్ల పాలయింది. కోతకు పంట నాశనం అయింది. ఎలా చూసినా రెండు తెలుగు రాష్ట్రాల్లో లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. కానీ రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వం వ్యవహరిస్తున్న విధానంలో స్పష్టంగా తేడా కనిపిస్తోంది. తెలంగాణ మంత్రులు దాదాపుగా అన్ని జిల్లాల్లో పర్యటించి రైతులకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వం కూడా స్పందించింది. కానీ ఏపీ ప్రభుత్వంలో మాత్రం పెద్దగా కదలిక ఉండటం లేదు. వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాటలు నిరాశావాదంతో ఉంటున్నాయి. అధికారులు కూడా రైతుల్ని ఆదుకుంటామని భరోసా ఇవ్వలేకపోతున్నారు. కనీసం నష్టపరిహారం ఎంత ఇస్తామన్నది కూడా చెప్పలేదు. దీంతో ఏపీ రైతుల్లో దిగులు కనిపిస్తోంది. తెలంగాణలో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. పదివేల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిజానికి ఈ పరిహారాన్ని సీఎం కేసీఆర్ మూడు వారాల కిందట భారీగా వడగళ్ల వాన వచ్చినప్పుడే ప్రకటించారు. కానీ ఇప్పుడు మరిన్ని వర్షాలు ఎక్కువగా పడ్డాయి. మరి కొన్ని లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ధాన్యం తడిచిపోయింది. అందుకే అందరికీ పన్నెండో తేదీ నుంచి పంపిణీ చేయాలని నిర్ణయించారు. రైతుకు జరిగి నష్టం రూ. పదివేలుతో పూడిపోదు. కానీ..ప్రభుత్వం ఎంతో కొంత ఆదుకుందన్న భరోసా దక్కుతుంది. అలాగే తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని భరోసా కల్పిస్తున్నారు. అదే సమయంలో ఏపీలో ఇప్పటి వరకూ పంట నష్టపోయిన రైతులకు ఇతమిత్థంగా ఇంత ఇస్తామన్న ప్రకటన రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి రాలేదు. పరిహారం అందలేదని ఒక్క రైతు కూడా చెప్పలేదని వారి మొహంలో చిరునవ్వు కనిపించేలా అందరికీ పరిహారం ఇవ్వాలని సీఎం జగన్ సమీక్షలో ఆదేశించారు.కానీ ఎంత ఇవ్వాలి.. ఎప్పుడు ఇవ్వాలన్నదానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు ఎవరైనా అండగా ఉంటే ఉండే ధైర్యం వేరు. అందుకే ఏదైనా విపత్తు జరగగానే తామున్నామంటూ ప్రభుత్వానికి చెందిన వారు వెళ్తారు. బాధితుల్లో భరోసా కల్పిస్తారు. తెలంగాణ ప్రభుత్వ మంత్రులు అదే చేశారు. కేటీఆర్ సహా వర్ష ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులందరూ రైతుల్ని పరామర్శించారు. తమది రైతు ప్రభుత్వమని ఖచ్చితంగా ఆదుకుంటామని..తడిచిన ధాన్యాన్ని కొంటామని భరోసా ఇచ్చారు. ఇది ఓ రకంగా తెలంగాణ రైతులకు నైతిక స్థైర్యం ఇచ్చింది. అయితే ఏపీలో మాత్రం ఏ ఒక్క మంత్రి రైతుల్ని పరామర్శించేందుకు ఆసక్తి చూపించడం లేదు. రైతులు సంతోషంగా ఉన్నారనే ప్రకటనలు చేస్తూ ఉంటారు కానీ.. వర్ష ప్రభావిత ప్రాంతాల్లోని రైతులను చూస్తే ఎవరికైనా కడుపు తరుక్కుపోతుంది. చేతికి వచ్చిన పంట పాడైపోయింది. చేతికి రావాల్సిన పంట వస్తుందన్న గ్యారంటీలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం నుంచి దైర్యం చెప్పడానికి కూడా ఎవరూ రాలేదు. అదే సమయంలో ప్రెస్ మీట్ పెట్టిన అధికారులు .. సాయం చేయలేమని కావాలంటే సలహాలిస్తామని ప్రకటించడం వివాదాస్పదమయింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్థిక సమస్యల్లో ఉంది. ఇప్పటికీ పూర్తి స్థాయిలో ఉద్యోగులకు జీతాలు, రిటైరైన ఉద్యోగులకు పెన్షన్లు ఇవ్వలేకపోయారు. రిజర్వ్ బ్యాంక్ వద్ద ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యాన్ని వాడుకుని రోజువారీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇలాంటి సమయంలో ప్రకృతి విపత్తులకు ప్రజలకు సాయం చేయడానికి ఆర్థిక సమస్యలు ఉండటం వల్లనే చురుకుగా కదలడం లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది.అయితే ధాన్యం కొనుగోలు విషయంలో నిర్లక్ష్యం చేయకుండా ఉంటే.. వేల మంది రైతులు నష్టాన్ని తప్పించుకునేవారనే వాదన ఉంది. ప్రభుత్వం ఆర్థికం కాకపోయినా.. సమయానుకూలంగా చురుకుగా వ్యవహరిస్తే.. ఎంతో నష్టం తగ్గి ఉండేదని రైతులు అంటున్నారు. కారణం ఏదైనా తెలంగాణతో పోలిస్తే ఏపీ రైతులు ఎక్కువగా నష్టపోయారు. కానీ ప్రభుత్వం మత్రం అనుకున్న విధంగా చురుకుగా స్పందించలేకపోతోంది. ఇది రైతుల్లో ప్రభుత్వంపై ఆగ్రహానికి కారణం అవుతోంది. అటు మంత్రులు.. అటు యంత్రాంగం మొత్తం అకాల వర్షాల వల్ల జరిగిన నష్టంపై యాంత్రికంగా వ్యవహరించడంతో రైతులకష్టాలు మరింత పెరుగుతున్నాయి

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ఒంగోలు బేస్తవారిపేట పట్టణ సమీపంలోని అమరావతి అనంతపురం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు ఆటోలను కారు ఢీ కొట్టింది. ఘటనలో ఎనిమిది మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. అలుకు రంజాన్ స్వాన్(25) మృతి చెందాడు.మృతుడు,మరో ఆరుగురు ఒరిస్సాకు చెందిన బీఈడీ విద్యార్థులుగా గుర్తించారు. గాయపడ్డ వారిలో ఇద్దరు ఆటో డ్రైవర్లు వున్నారు. ఒరిస్సా కు చెందిన బిఈడి విద్యార్థులు పరీక్షలు రాసేందుకు రాత్రి కంభం నుండి బేస్తవారిపేటకు ఆటోలలో వస్తున్న క్రమంలో ఘటన చోటు చేసుకుంది. గాయపడ్డ వారిని కంభం ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తరలించారు.

## ఆనంద నిలయాన్ని వీడియో చిత్రీకరించిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు టీటీడీ సీవీఎస్వో

తిరుమల, తిరుమల శ్రీవారి ఆలయంలో ఆనంద నిలయాన్ని వీడియో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని టీటీడీ నిఘా మరియు భద్రతాధికారి నరసింహ కిషోర్ తెలిపారు. టీటీడీ నిబంధనల ప్రకారం శ్రీవారి ఆలయంలోనికి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లడం, వీడియో చిత్రీకరించడం నేరమన్నది భక్తులందరికీ తెలుసు.నిన్న రాత్రి తిరుమలలో ఉరుములతో కూడిన భారీ వర్షం పడిన నేపథ్యంలో, దాదాపు రెండు గంటల పాటు విద్యుత్తు అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలోనే సదరు భక్తుడు పెన్ కెమెరా ద్వారా వీడియో చిత్రీకరించినట్టు అనుమానిస్తున్నామన్నారు.అన్నీ తెలిసి ఒక భక్తుడు ఇలా చేయడం చాలా బాధాకరము. సీసీటీవీల ద్వారా సదరు భక్తుడిని గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని టీటీడీ నిఘా మరియు భద్రతాధికారి నరసింహ కిషోర్ తెలిపారు. టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి ఆదేశాల మేరకు ఈ ఘటనపై పూర్తి విచారణ చేపడుతున్నామని కూడా సీవీఎస్వో తెలిపారు.

## వైభవంగా నల్లగొండ్ల బ్రహ్మోత్సవాలు

నెల్లూరునెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామంలో కలిసిన శ్రీ గృహ మల్లేశ్వర శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారి కళ్యాణం నిర్వహించారు. ఈ కళ్యాణ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని తిలకించారు. దేవస్థాన ధర్మకర్త మండలి మరియు దేవస్థాన ఈవో కళ్యాణోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధి సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి, స్వామి అమ్మవారి కృపలకు పాత్రులయ్యారు.

## బాసర లో కేంద్ర మంత్రి

నిర్మల్ బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల సోమవారం దర్శించుకున్నారు. అయనకు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఈవో కేంద్ర మంత్రిని ఘనంగా సన్మానించారు. .

## ఏసీబీ వలలో జూనియర్ అసిస్టెంట్

కాకినాడకాకినాడ జిజిహెచ్ లో అవినీతి నిరోధక శాఖ అధికారుల దాడులు జూనియర్ అసిస్టెంట్ వై సత్యనారాయణ పై వచ్చిన ఆరోపణలకు స్పందించిన ఏ సీబీ బృందాలు రంగంలోకి దిగాయి. జిజిహెచ్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాకులో ఏసీబీసీఐ సతీష్ కుమార్ సోదాలు నిర్వహించారు. ఏసీబీ అడిషనల్ ఎస్పీ సౌజన్య మాట్ఆడుతూ సత్యనారాయణ కుటుంబ సభ్యుల కి సంబంధించి ఆరు చోట్ల దాడులు జరుగుతున్నాయి. ప్రస్తుతానికి 40,000 నగదు, 60 కాసుల బంగారం, నాలుగు కీలక డాక్యుమెంట్లు దొరికాయి. సోదాలు కొనసాగుతున్నాయని అన్నారు.

## సిపిఎస్ రద్దు చేయాలని ఏపీ జెఎసి అమరావతి నాయకులు డిమాండ్

అమరావతి ఉపాధ్యాయుల పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని సస్పెన్షన్ ఎత్తి వేసి తిరిగి విధులలో చేర్చుకోవాలని ఏపీ జెఎసి అమరావతి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నవీన్ కుమార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. సిపిఎస్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 11వ పిఆర్సి పే స్కేల్ ను తక్షణమే బయట పెట్టాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిజెఏసి అమరావతి రాష్ట్ర కోశాధికారి వి వి మురళీకృష్ణనాయుడు, రాష్ట్ర సలహాదారుల్క్రైుడ్ కె శ్రీరాములు, జిల్లా చైర్మన్ ఎస్.వీ రమణ, డిప్యూటీ తహశీల్దార్ రాజు, పి.లక్ష్మణరావు, పి వేణుగోపాలరావు, వసంతరావు, అర్లయ్య, ఎస్ గోవింద రావు, కె సుమన్, బైరి అప్పారావు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పోలీసు స్పందనకు 82 ఫిర్యాదులు



నంద్యాల మా ప్రతినిధి మే 8 విభారె న్యూస్ :-నంద్యాల జిల్లా బొమ్మల సత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదిదారుల నుంచి నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ కె.రఘువీర్ రెడ్డి గారు 82 ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ఫిర్యాదిదారుల సమస్యలను జిల్లా ఎస్పీ గారు అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్ లో మాట్లాడి చట్టపరిధిలో ఫిర్యాదిదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. .చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని ,స్పందన ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని ,స్పందన పిర్యదుల పట్ల నిర్లక్ష్యం గా వ్యవహరించరాదని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ లో మాట్లాడి పరిష్కారం చూపాలని ఆదేశించారు.ఫిర్యాదులలో కొన్ని .బనగానపల్లె మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన పుల్లయ్య కుమారుడు నవీన్ కుమార్ ఉద్యోగం ఇప్పిస్తాను అని శివ బాలాజీ వద్ద 2,20,000/- నగదు ,వేణుకుమార్ వద్ద 60,000/- నగదు తీసుకొని 7 నెలలవుతున్న ఉద్యోగం ఇప్పించకుండా డబ్బులు ఇవ్వకుండా మోసం చేస్తున్నాడని పండ్లపురం గ్రామానికి చెందిన తలారి .శివ బాలాజీ ,. కొట్టాల గ్రామానికి చెందిన వేణుకుమార్ తమకు న్యాయం చెయ్యండి అని జిల్లా ఎస్పీ గారికి ఫిర్యాదు చేశారు.మా బంధువుల పెళ్లి కొరకు ప్రకాశం జిల్లా కంభం కు వెళ్లి వస్తుండగా హుబ్లీ విజయవాడ ట్రైన్ కు 17503 నంబర్ గల ప్యాసింజర్ బోగీలో ప్రయాణం చేస్తుండగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నా మెడలోని బంగారు నక్లెస్ మూడు తులాలు దాని విలువ సుమారు 75,000/- ఉంటుంది దాన్ని లాక్కొని వెళ్లిపోయారు .నేను వెంటనే నంద్యాలలో రైల్వే పోలీసు వారికి విషయం తెలుపగా ఫిఐర్ నమోదు చేశారు కానీ దానిని అండ్ డిటెక్టబుల్ లో పెట్టారు కావున నాయందు దయ ఉంచి కేసు రీ ఓ పెన్ చే సి దొంగిలించబడిన నక్లెస్ తిరిగి నాకు ఇప్పించగలరని నంద్యాల పట్టణం టెక్కె కు చెందిన ముంతాజ్ గారు నంద్యాల జిల్లా ఎస్పీ గారికి ఫిర్యాదు చేశారు.కొలిమిగుండ్ల యందు శ్రీ

జిల్లా ఎస్పీ శ్రీ కె.రఘువీర్ రెడ్డి

సాయి లక్ష్మీ నరసింహ ఆటో ఫైనాన్స్ పేరుతో 2017 వ సంవత్సరంలో డి. గోపాల్ ,బి .కంబగిరి స్వామి, కె .మద్దిలేటి, కె.మధు మరియు మరో ఇద్దరు కలిసి ఫైనాన్స్ కంపెనీ నడుపుతుండగా కొలిమిగుండ్ల గ్రామానికి చెందిన ఖ.చిన్నపురెడ్డి అయిన నేను మరియు నా బంధువులతో ఫైనాన్స్ వారికి సుమారుగా 17 లక్షల వరకు డిపాజిట్లు కట్టించగా వారు ప్రస్తుతం కంపెనీ మూసేశారు.ఇప్పుడు డబ్బులు అడుగుతుంటే బెదిరిస్తున్నారని నాకు న్యాయం చెయ్యండి అని పి .చిన్నపరెడ్డి జిల్లా ఎస్పీ గారికి ఫిర్యాదు చేశారు.నా తమ్ముడు కరెంట్ షాక్ తగలడం వల్ల ఆసుపత్రి ఖర్చుల కొరకు డోన్ పట్టణానికి చెందిన శశికుమార్ తండ్రి పుల్లయ్య అనే వ్యక్తి దగ్గర రెండున్నర సెంట్లు మా ఇంటి స్థలం కుదువ పెట్టి 50 వేల రూపాయలను ఐదు రూపాయల వడ్డీకి తీసుకున్నాను. కానీ అతను కుదువ పెట్టిన మా స్థలాన్ని 12 లక్షల రూపాయలకు వేరే వాళ్ళకు అమ్మాలని చూస్తున్నాడని నాకు చదువు రాదని చంపుతానని బెదిరిస్తున్నాడు నాకు న్యాయం చేయండి అంటూ డి అరుణ జ్యోతి గారు నంద్యాల జిల్లా ఎస్పీ గారికి ఫిర్యాదు చేశారు.ఈ రోజు స్పందన కార్యాక్రమంలో నంద్యాల సబ్ డివిజన్ పోలీసు అదికారులను అందరినీ పిలిపించి ఫిర్యాదిదారులతో జిల్లా ఎస్పీ గారు నేరుగా మాట్లాడిన తర్వాత నంద్యాల సబ్ డివిజన్ కు సంబందించిన ఫిర్యాదులను నంద్యాల సబ్ డివిజన్ పోలీసు అదికారులు ఫిర్యాదిదారుల సమస్యలను విని జిల్లా పోలీసు కార్యాలయం నందు విచారించి పరిష్కారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు నంద్యాల టౌన్ డిఎస్పి సి. మహేశ్వర్ రెడ్డి , మరియు సబ్ డివిజన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులపై పెట్టిన అక్రమ కేసులు, సస్పెన్షన్లు ఎత్తివేయాలి ::ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపు.





కర్నూలు,మే 8విభారె న్యూస్ : ఏపీజేఏసీ అమరావతి కర్నూల్ జిల్లా శాఖ పక్షాన ఒక వినతి పత్రమును సమర్పించడం జరిగినది. ఈ సందర్భముగా కర్నూల్ జిల్లా చైర్మన్ గిరి కుమార్ రెడ్డి మాట్లాడుతూ గురువులను గౌరవించాడం మన సంప్రదాయమని తల్లి తండ్రులు తర్వాతి స్థానం గురువులదేనని. వారి కంట నీరు రాష్ట్రాభివృద్ధికి మంచిది కాదని, విద్యాబుద్ధులు , క్రమశిక్షణ నేర్పడం ద్వారా వారు సమాజానికి దశదిశ నిర్దేశం చేయడమే కాకుండా వారి బోధనలతో దేశానికి అత్యుత్తమ పౌరులను, అధికారులను, పాలకులను అందిస్తారని అలాంటి ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాల్సింది పోయి ఈ రోజు వారిపై కేసులు పెట్టి సస్పెన్షన్లు చేస్తూ వారిని భయాందోళనలకు గురి చేయడం యెంత వరకు సబబు అని ప్రశ్నించారు. వారు న్యాయమైన డిమాండ్ల సాధన కొరకు సిపి ఎస్ రద్దు కొరకు పోరాడుతుంటే వారిని ఉక్కు పాదముతో అణచివేస్తూ వారిని సస్పెన్షన్లు చేస్తూ వారి పై క్రిమినల్ కేసులు బైండ్ ఓవర్ కేసులు అక్రమంగా పెట్టడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. ఉపాధ్యాయులను ఈ విధంగా అవమానిస్తూ వారికి బోధనేతర పనులు కేటాయించి వారిని హింసించడం వల్ల రాష్ట్రములోని విద్యార్థుల భవిష్యత్తు ప్రస్నార్థకంగా మారిపోతోంది అని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరచి వారిని వేధింపులు చేయకుండా వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమములో ఏపీజేఏసీ అమరావతి జనరల్ సెక్రటరీ కీ వై కృష్ణ, హెడ్మాస్టర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఓంకార్ యాదవ్ , మునిసిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకట రెడ్డి ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి మరియానందం గారు డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వర రావు , టైపిస్ట్ ఒస్టెనోగ్రాఫర్ల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్ పంచాయత్ రాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపోగు సురేష్ , వి ఆర్ ఓ ల సంఘ ప్రధాన కార్యదర్శి సూరి బాపాల్గొన్నారు

# స్పందన లో నూతన ఓరవడి




నంద్యాల మా ప్రతినిధి మే 8 విభారె న్యూస్ :-:-వివిధ సమస్యల పరిష్కారం కోసం స్పందన ద్వారా ప్రజల నుంచి అందే వినతులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సకాలంలో వాటిని పరిష్కరించేందుకు గతంలో చర్యలు తీసుకోనే

తక్షణమే పరిష్కారం అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్

వారమని ఇప్పుడు అలా కాకుండా స్పందన లో నూతన ఓరవడి తక్షణమే పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ అన్నారు . . పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో పట్టణంలో ఉన్న ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఆయన వినతులను స్వీకరించారు. ఐదు అర్జీలు వచ్చాయని తెలిపారు . డోర్ నెంబర్ మార్పునకు రెండు అర్జీలు. నీటి సమస్య . టీడ్కో. శానిటేషన్ కోసం ఒకోక్క అర్జీలు అందాయని వాటిని వెను వెంటనే సచివాలయ సెక్రటరీలను పిలిచి అర్జీ దారుల ముందరనే పరిష్కారం చేసామని అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా వరల్డ్ రెడ్ క్రాస్ డే

నంద్యాల మా ప్రతినిధి మే 8 విభారె న్యూస్ :-సోమవారం కలెక్టరేట్ లోని స్పందన కార్యక్రమంలో భాగంగా రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాట్ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ నిశాంతి. టి. పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ముద్రించిన వడదెబ్బ, వడగాలులపై అవగాహన కార్యక్రమ కరపత్రాలను కూడ ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల, డిఆర్ఓ పుల్లయ్య, జెడ్పి డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, జిల్లా వైద్యాధికారి డా. వెంకటరమణ, జిల్లా విద్యాశాఖ అధికారి అనురాధ, వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డా.జఫరుల్లా, మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి, రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యుడు మద్దిలేటి తదితరులు హాజరై స్పందనలో వివిధ ప్రాంతాల నుంచి అర్జీలు అందజేయడానికి విచ్చేసిన అర్జీ దారులకు అన్నదానం చేశారు.

## సి ప్రదక్ష కు మండల స్థాయి లో మొదటి ర్యాంకు .

-నంద్యాల మా ప్రతినిధి మే 8 విభారె న్యూస్ :- చాగలమర్రి మండల కేంద్రంలోని శ్రీ రాఘవేంద్ర ఉన్నత పాఠశాల నందు పదవ తరగతి పరీక్షల్లో 572 మార్కులతో మండల స్థాయిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థిని సి ప్రదీక్షను, సల్లా నాగరాజు ఆధ్వర్యంలో శాలువాతో



సన్మానించి జ్ఞాపిక అందజేసి, మిఠాయిలు తినిపించారు. సాధారణ రైతు కూలి కుటుంబం చెందిన సుధాకర్ రెడ్డి, ధనలక్ష్మిల కుమార్తె ప్రదీక్ష కష్టపడి చదివి మండల స్థాయిలో ప్రధమ స్థానం సాధించినందుకు గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి నరసింహులు, పెద్ద నరసింహారెడ్డి, రాఘవేంద్ర హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు మౌలాలి, వీరం రెడ్డి భాస్కర్ రెడ్డి, కశినేని ఓబులేసు, టైలర్ భాష, నాగార్జున, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొని విద్యార్థినిని అభినందించారు.

# కార్మికులకు కేటాయించిన స్థలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం

జాయింట్ కలెక్టర్ కు వినతి పత్రం

సిపిఐ జిల్లా నాయకులు



నంద్యాల మా ప్రతినిధి మే 8 విభారె న్యూస్ :-నంద్యాల పట్టణ శివారు ప్రాంతమైన ఆటోనగర్లో మెకానికులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందనలో జాయింట్ కలెక్టర్ నిశాంతి గారికి సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగిందని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ తెలిపారు. అనంతరం మాట్లాడుతూ నంద్యాల పట్టణ శివారు ప్రాంతంలో మెకానిక్ కార్మికులకు 45 ఎకరాల స్థలం కేటాయించి ఆటోనగర్ గా నామకరణం చేయడం జరిగిందన్నారు. . అటో నగర్ లో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడ మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అక్కడ మెకానిక్ లకు ప్రభుత్వం వారు ఆటోనగర్లో మెకానిక్ షెడ్లకు ఉచితంగా స్థలం కేటాయిస్తామని చెప్పి కమిటీ వారు మెకానికులతో స్థలాలకు డబ్బులు కట్టించుకుంటూ అడిగిన వారిపై కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారన్నారు. ఆ స్థలాన్ని మెకానికులకు కాకుండా బయటి వారికి అమ్ముకుంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. వెంటనే అధికారులు ఆటోనగర్లో మెకానికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకపోతే సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో దశల వారి పోరాటాలకు సిద్ధమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు హుస్సేన్ సా ఆటోనగర్ మెకానిక్లు మా భాష రహిమాన్ జాకీర్ ఇస్మాయిల్ కాజా నజీర్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



నంద్యాల మా ప్రతినిధి మే 8 విభారె న్యూస్ :-జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మంగళవారంరాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభిస్తున్న నేపథ్యంలో స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ప్రతి అర్జీదారుని దరఖాస్తును 24 గంటలలో వీక్షించి అంగీకరించడం లేదా ఇతర శాఖకు చెందినదే అయితే సంబంధిత శాఖకు బదిలీ చేసి అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ నిశాంతి. టి. సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో వినూత్న రీతిలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిశాంతి.టి తో పాటు డిఆర్ఓ పుల్లయ్య, తదితర జిల్లాధికారులు జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల నుండి

అధికారులను ఆదేశించిన జాయింట్ కలెక్టర్ నిశాంతి. టి.

దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నిశాంతి. టి. మాట్లాడుతూ స్పందన సమస్యల నాణ్యత పరిష్కారానికి సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 9న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నేపథ్యంలో అన్ని మండలాల అధికారులు వీడియో కాన్ఫరెన్స్ కు ప్రజాప్రతినిధులను ఆహ్వానించి ప్రజలకు సంతృప్తి చెందే స్థాయిలో స్పందన సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రతిరోజు సచివాలయంలో మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే సచివాలయ సిబ్బంది హాజరై స్పందన గ్రీవెన్స్ తీసుకొని సంబందిత నోట్ ఫోటోగ్రాఫ్స్ స్పందన గ్రూప్లో అప్లోడ్ చేయాలన్నారు. అలాగే గూగుల్ షీట్ ఫార్మ్ ఓపెన్ చేసి నిర్దేశించిన కాలమ్ లను పూరించి అప్లోడ్ చేయాలన్నారు. స్పందన సమస్యలను సీరియస్ గా తీసుకొని ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో స్పందన సమస్యలు పరిష్కరించాలన్నారు. అర్జీదారునికి ఇచ్చే ఎండార్స్మెంట్ గాని స్పీకింగ్ ఆర్డర్స్ కానీ ఫిర్యాదుదారునికి ఖచ్చితంగా చేరేలా వుండాలన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాలు జారీ చేసి పెండింగులో వున్న లబ్ధిదారుల ఈకేవైసి వాలంటీర్ల ద్వారా పూర్తి చేయించి మంగళవారం సాయంత్రంలోగా నివేదికలు పంపేందుకు ఎంపీడీవోలు, తాసిల్దార్లు, హౌసింగ్ ఏఈలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆమె ఆదేశించారు.ఇంకా ఈ కార్యక్రమంలో 175 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య పై తనిఖీలు

నంద్యాల మా ప్రతినిధి మే 8 :- నంద్యాల జిల్లా కేంద్రంలో బొమ్మలసత్రం యందు సోమవారం నాడు అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి ఇరువురు పారిశుధ్య పనులను తనిఖీలు చేశారు. పారిశుధ్య నిర్వహణపై పలు సూచనలు పారిశుధ్య కార్మికులకు సూచించారు. పారిశుధ్య పై అశ్రద్ధ చూపొద్దని హెచ్చరించారు. పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఈ



కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# గిరిజన కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలి

నంద్యాల మా ప్రతినిధి మే 8 విభారె న్యూస్ :-..రాష్ట్రంలో గిరిజనులకు ఎక్కడ కూడా రక్షణ లేకుండా పోతుందని, దాడులు, హత్యలు అఘాయిత్యాలు ఎక్కువయ్యాయని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ మండిపడ్డారు.సోమవారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్లో గిరిజన యువకుడిని దారుణంగా హత్య చేసిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని స్థానిక గిరిజన నాయకులతో మృతుని కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆయన వెంట ఎస్ ఎన్ తండా సర్పంచ్ శివ నాయక్, జిపిఎస్ శ్రీశైలం ఇన్చార్జి రాము నాయక్, రామ్ బాలాజీ నాయక్ రిటైర్డ్ ఉద్యోగి, బాలాజీ నాయక్, శివ నాయక్ మల్లికార్జున నాయక్, మరియు మృతుని కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..



# వంట గ్యాస్ సిలిండర్ 500 రూపాయలకే అందించాలి ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య డిమాండ్

కర్నూలు, మే 8విభారె న్యూస్ :ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి మహిళకి 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య రాష్ట్ర సమితి పిలుపుమేరకు ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య కర్నూల్ నగర సమితి ఆధ్వర్యంలో కర్నూల్ కలెక్టర్ కార్యాలయం ముందు ఖాళీ సిలిండర్లతో, ప్లే కార్డ్స్ ,పట్టుకొని ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య నగర కార్యదర్శి వరలక్ష్మి సిపిఐ నగర కార్యదర్శి




రామకృష్ణారెడ్డి లో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 400 రూపాయల సిలిండర్ ధర 20 రూపాయలు పెంచుతూనే నానా రచ్చ చేసి మేము అధికారంలోకి వస్తే గ్యాస్ సిలిండర్ ధర స్థిరంగా ఉంచుతామని 2014 ఎన్నికల ముందు హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతూ ఉన్నప్పటికీ దేశంలో వంట గ్యాస్ ధరలు రోజురోజుకు పెరుగుతూ 1260 రూపాయలకు చేరిందని ఇది బిజెపి అసమర్థ పాలనకు నిదర్శనమని వారు మండిపడ్డారు దిన దినం గ్యాస్ రేట్లు పెరగడంతో ఆ ప్రభావం నిత్యవసర వస్తువుల ధరలపై పడి నిత్యవసర వస్తువులు ధరలు విపరీతంగా పెరగడంతో మహిళలు వారి కుటుంబానికి పౌష్టికాహారం అందించలేక నానా అవస్థలు పడతా ఉంటే దేశ ప్రధానమంత్రి మాత్రం ప్రజల గురించి మహిళల ఇబ్బందుల గురించి ఏమాత్రం పట్టించుకోకుండా సిగ్గు ఎగ్గు లేకుండా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ కన్నతల్లికి అన్నం పెట్టలేని వాడు పిన తల్లికి బంగారు గాజులు చేయించాడు అనే చందంగా కర్ణాటక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని అక్కడి ప్రజలకు దొంగ వాగ్దానాలు ఇస్తూ ప్రజల్ని మోసం చేస్తున్నారని అయితే ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నికల గారడీలను ప్రజల గమనిస్తున్నారని తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంలో భాగంగానే ఉంది కాబట్టి వంట గ్యాస్ పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సుంకము తగ్గించి రాజస్థాన్ ప్రభుత్వం తరహాలో తెల్ల రేషన్ కార్డుదారులందరికి 500 రూపాయలకే సిలిండర్ అందించాలని లేనిపక్షంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య రాష్ట్రవ్యాప్తంగా మహిళలందరిని సమీకరించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య నగర నాయకులు నాగేశ్వరమ్మ, రంజాబి, సునీత, రత్నమ్మ, విజయమ్మ, శాంత కుమారి, లలితమ్మ , భాగ్యశ్రీ, సుల్తానా ,పర్వీన ,సిపిఐ నగర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు మహేషు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు నగర అధ్యక్ష కార్యదర్శులు బాబయ్య బిసన్న నగర నాయకులు రామచంద్ర ,నబి, తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యం పై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

రవి చంద్రా రెడ్డి మున్సిపల్ కమిషనర్

నంద్యాల మా ప్రతినిధి మే 8 విభారె న్యూస్ :- నంద్యాల పట్టణంలో సోమవారం నాడు ఉదయం బొమ్మలసత్రం. రైతు నగరం. నూనెపల్లె. బెన్నీ కాంప్లెక్స్. హనీఫ్ నగర్. శానిటేషన్ పై. డ్రైనేజీ. నీటి సమస్య గురించి పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు . పారిశుధ్యంపై తనిఖీలు నిర్వహించిన కమిషనర్ రవి చంద్రా రెడ్డి. పారిశుధ్య కార్మికులకు పారిశుధ్య నిర్వహణపై పలు సూచనలు చేశారు. పారిశుధ్య నిర్వహణపై అశ్రద్ధ చేయకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి. శానిటేషన్ ఇన్స్పెక్టర్ లక్ష్మి నారాయణ. డీఈ జయ భారత్ రెడీ. మున్సిపల్ సిబ్బంది . సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190